17 వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప / అన్నమయ్య
08 సోమవారం, జులై 2024 పేజీలు: 08

## జిల్లా అభివృద్ధికి కృషి

**సమర్థవంతంగా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుకు కృషి**

**అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పని చేయడం నా అదృష్టం**

**అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ చామకూరి**



రాయచోటి, మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి అందరి సహకారంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి పాటు పడతామని అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబర్ లో వేద పండితుల ఆశీర్వచనాలు అనంతరం ఉదయం 11:32 గంటలకు శ్రీధర్ చామకూరి అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెంది బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తనను రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా నియమించిందన్నారు. ఇది తన మొట్టమొదటి కలెక్టర్ పోస్ట్ అని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు 6లో

## అధిష్టానం సైలెంట్ నాయకులు వైలెంట్..!




**రాజంపేటలో ఉనికి కోసం నాయకుల పాట్లు**
**మేమే తోపులమంటూ ప్రకటనలు..**
**స్పష్టమైన అవగాహనలో అధిష్టానం..**
**ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని పరిస్థితి..**
**పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు తీవ్రయత్నాలు..**
**అసలైన నాయకుని కే అవకాశం అంటున్న టిడిపి శ్రేణులు..**

అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్: పార్లమెంటు కేంద్రమైన రాజంపేటలో అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల పర్యటనలో భాగంగా రాజంపేటకు అనేక వరాలు గుప్పించారు. వారు చేసిన ప్రచారం ఇచ్చిన హామీల మేరకు రాజంపేటలో టిడిపి గెలుపు నల్లేరు మీద నడకే అని అందరూ భావించారు. అయితే గెలుపు నల్లేరు మీద నడకే అయినా ఆ నడకని కూడా సరిగా నడవలేక గెలుపు ముందట బొక్క బోర్ల పడ్డారు. రాజంపేటలో టిడిపి పరాజయం పాలైనా, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మరి రాజంపేటలో పెత్తనం కోసం, తమ ఉనికి కోసం తమకున్న పైత్యాన్ని మొత్తం రంగరించి నాయకులు చిత్ర విచిత్ర ప్రకటనలు, వేషాలు వేస్తున్నారు. రాజంపేట కు పెద్ద నేనంటే నేనంటే ఇప్పటికే ప్రకటనలు గుప్పించారు. అలాగే తమకు వీలైన దారిలో ఇతర 4లో

తాను వెళ్లడానికి దారి లేదంటే, తనకు రాజమార్గం కావాలని మరొకరు అడిగినట్లు రాజంపేట టిడిపిలో ఉనికి కోసం నాయకులు చేస్తున్న ఆరాటం, పోరాటం అంతా ఇంతా కాదు. అసలే రాష్ట్ర వ్యాప్తంగా కూటమి సునామీ కనిపించిన అన్ని అవకాశాలు ఉండి చేతులారా ఓటమిని కొని తెచ్చుకున్నారని విమర్శలు వెల్లువెత్తున్న వేళ రాజంపేట లో కొందరు నాయకులు టిడిపిలో తామే తోపులం అంటూ ప్రకటనలు చేస్తూ ఉనికి కోసం చేస్తున్న పోరాటాన్ని చూసి పలువురు టిడిపి శ్రేణులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. అధిష్టానం మంచి నిర్ణయం కోసం సైలెంట్‌గా పని చస్తుంటే , నాయకులు మాత్రం అధిష్టాన నిర్ణయం సంబంధం లేకుండా వైలెంట్ గా తమకు నచ్చిన దారిలో కనీ విని ఎరుగని విన్యాసాలు చేస్తున్నారు.

## సమన్వయముతో పని చేసి విజయవంతం చేయాలి

**నూతన ఇసుక పంపిణీ విధానంపై సమీక్ష**

**జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి**



కడప కలెక్టరేట్ మేజర్ న్యూస్: ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక విధానాన్ని అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్లో జేసీ గణేష్ కుమార్ తో కలసి తన అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సి) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివ శంకర్‌లో లోతేటి 6లో

**రాజకీయ వ్యవస్థను నాశనం చేసింది వైయస్ కుటుంబీకులే !**

వార్త 4 లో

**గ్రామాభివృద్ధికి పాటుపడతా**

**ఎమ్మెల్యే, ముక్కా కుటుంబం**

వార్త 5 లో

## మండల అభివృద్ధికి కృషి చేయాలి

**అర్హులందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలి**

**మండలంలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలి**

**రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి, మేజర్‌న్యూస్: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సంబేపల్లి మండల పరిషత్ సమావేశ భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సంబేపల్లి మండలం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని ఇకనుంచి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండలంలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి వెంటనే నివేదిక తయారు చేసి తమకు పంపాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ కాలనీలలో సిమెంట్ రోడ్లు డ్రైనేజీ కాలువలకు సంబంధించి ప్రపోజల్ పంపాలన్నారు. జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనులకు సంబంధించి ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన నీటి 4లో



# ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కురవంక ప్రజలు బ్రహ్మరథం

బెల్లె రెడ్డి ప్రసాద్, పసుపులేటి మోహన్ ఆధ్వర్యంలో సన్మానం



మదనపల్లె,మేజర్ న్యూస్ : ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కురవంక ప్రజలు బ్రహ్మరథం వట్టారు. కురవంకలోని హరేరామ,హరేకృష్ణ ఫంక్షన్ హాల్ నందు ఎంపీటీసి బెల్లె హారతి,స్థానిక నాయకులు పసుపులేటి మోహన్,బెల్లె రెడ్డి ప్రసాద్,పసుపులేటి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ కురవంక ప్రజలు తనపైన చూపిన అభిమానం మరువ లేనిదన్నారు. కురవంకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ పంచా యతీగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు.ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తనను సంప్రదిస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పసుపులేటి మోహన్, బెల్లె రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న నాయ కుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అని, నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే ఏకైక నాయకుడు అని కొని యాడారు. ఆయన సారథ్యంలో మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. మా ఆహ్వా నం మేరకు సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే జహాకి కురవంక ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నామ న్నారు. కార్యక్రమంలో శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, దారం హరిప్రసాద్, నాగూర్ వలి, షంషీర్, మార్పురి నాగార్జునబాబు, బీదం గురు నాథ్‌యాదవ్, జీ.వి.నాయుడు, శ్రీని వాసులు, నాగరాజ, కప్పల శ్రీరాములు, కురువంక ప్రజలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ



మదనపల్లె,మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా,మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ కళాశాల) విద్యా ర్థులు ప్రపంచ స్థాయిలో ఇంట ర్న్‌షిప్‌లో పాల్గొనడానికి తైవాన్ దేశానికి వెల్లినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని కొత్త నైపు ణ్యాలు అండ్ టెక్నిక్‌లను నేర్చుకోవడానికి 10 మంది విద్యార్థుల బృందం 8 జూలై నుండి 15 ఆగస్టు 2024 వరకు రీసెర్చ్ ఇంటర్న్‌షిప్ కోసం తైవాన్ లోని ఆసియా యూనివర్సిటీకి వెళ్లిందని ఆయన అన్నారు.కళాశాల నందు బి.టెక్ మూడవ సంవత్సరము చదువుతున్న సాయిమౌనిష్-సిఎస్‌టి, దాదాపీర్-సి.ఎస్.టి,రిషిత - సిఎస్‌ఈ, ప్రణీత - సిఎస్‌ఈ, సాయి స్ఫూర్తి - సిఎస్‌ఈ, ఆమేయ - కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషల్ ఇంటలి జెన్స్, ధనుష్ రెడ్డి - కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్,అలీ సయ్యద్ - కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్, ఇందు ఈశ్వర్ శివాని - కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్ పూజిత - కంప్యూటర్‌సైన్స్ డేటా సైన్స్ విద్యార్థులు ఉన్నారని ఆయన అన్నారు. అంత ర్జాతీయ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సి పాల్ డాక్టర్ సి.యువరాజ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ యు.విజయ లక్ష్మి అధ్యాపకులు అభినందనలు తెలియ జేశారు.

# ముస్లింల అభివృద్ధికి ఎంపీజే పని చేయాలి

ముస్లిం మత పెద్ద షేక్ సిరాజుద్దీన్




రాజంపేట, మేజర్ న్యూస్‌బీ ముస్లింల అభివృద్ధి కోసం మూ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ పని చేయాలని స్థానిక ముస్లిం మత పెద్ద షేక్ సిరాజుద్దీన్ కోరారు. ఆదివారం రాజంపేటలో జరిగిన ఎంపీజే సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకా లను ముస్లిం పేదలకు అందే విధముగా ఎంపీజే నాయకులు కృషి చేయా లని ఆయన కోరారు. ఉర్దూ స్కూల్ లను మైనార్టీ హాస్టల్‌ల పనితీరును పరిశీలించి లోటు పాట్లు ఉంటే విద్యార్థులకు ఇబ్బందులు ఉంటే ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు ఎస్ ముజఫర్ అహ్మద్,. ఈ నాయ తుల్లా, కరీం, షేక్ మహబూబ్ బాషా, మిల్లర్ కరీం, అంజాత్ రెహమాన్ పాల్గొన్నారు.

# రవాణాశాఖ మంత్రిని కలిసిన జయచంద్ర రెడ్డి



ములకలచెరువు, మేజర్ న్యూస్ : తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి ఆదివారం చిన్నమండెం మండ లం బోడిరెడ్డిగారి పల్లిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డిని వారి నివా సంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం నియోజకవర్గ అభి వృద్ధి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. జయ చంద్ర రెడ్డి వెంట యువ నాయకులు చిటికి శివారెడ్డి, సోషల్ మీడియా కోర్డినేటర్ కొండ్రెడ్డి అశోక్, శివ తదితరులు ఉన్నారు.

**గొంగ్రాతి అమ్మవారి జాతరలో జయచంద్ర రెడ్డి..**

బి.కొత్తకోట మండలం తుమ్మనగుట్ట గ్రామంలో ఆదివారం గొంగ్రాతి అమ్మవారి తిరునాళ్ళకు గ్రామస్తుల పిలుపు మేరకు తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ దాసరిపల్లి జయచంద్రారెడ్డి హాజరై జాతరలో పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు మస్తాన్ రెడ్డి ,కేశవరెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఫజుల,సి ఉదయ్ కుమార్, కొట్టాల జయచంద్ర రెడ్డి, ఆనంద్ రెడ్డి,కే.జైనుల్లా, మాజీ సర్పంచ్ నాగరాజు, సీనియర్ నాయకులు రెడ్డి భాష, భాజపా రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు శోభారాణి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా తొగటవీర క్షత్రియ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం



మదనపల్లె,మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణంలోని తొగటవీర క్షత్రియ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహా సంగా జరిగింది.నీరుగట్టువారిపల్లెలోనే చౌడేశ్వరి ఆలయం నందు ఆదివారం తొగటకుల ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం కన్నుల పండుగలా సాగింది.ఈ కార్యక్రమానికి తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా నూతన అధ్యక్షుడిగా పురాణం చంద్రశేఖర్, కార్యదర్శిగా బండి పవన్‌కుమార్, కోశాధికారిగా రామి శెట్టి రత్నమయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగావీరాంజ నేయ ప్రసాద్ మాట్లాడుతూ తొగటవీర క్షత్రియుల సంక్షేమం,అభివృద్ధికి నూతన కమిటీ పని చేస్తుందన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులైన పురా ణం చంద్రశేఖర్, బండి పవన్ కుమార్,రామిశెట్టి రత్నమయ్య మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవులు అప్పగించిన తొగట వీరక్షత్రియు లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మోడెం వెంకటరమణ,ఉప్పు రామచంద్ర, నార్నవరం వెంకటేష్, ఉప్పు శ్రీనివా సులు, పురాణం వెంకటరమణ, ప్రభాకర్, లోకేష్, భోజనపు వెంకటనారా యణ, కమలామగ్రి కృష్ణ, 33 వార్డు కౌన్సిలర్ ఎం.వి.రమణ, భువనేశ్వరి, సత్య, రామిశెట్టి ఆంజనేయులు, బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, బొమ్మిశెట్టి పురు షోత్తం, నరావుల మణిశంకర్, మోడెం నాగరాజు, తుమ్మగింజల వెంకటేష్, రమేష్, విశ్వనాథ్,యుటీఎఫ్ నాయకులు పురం వెంకటరమణ పాల్గొన్నారు.

# బి.కొత్తకోటను మేజర్ పంచాయతీగా మార్చాలని నిరసన



బి.కొత్తకోట, మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజక వర్గం బి.కొత్తకోటను నగర పంచాయతీ నుంచి మేజర్ పంచాయతీగా మార్చాలని బి.కొత్తకోట పట్టణంలోని జ్యోతి బస్టాండ్‌లో అఖిలపక్షం ఆధ్వ ర్యంలో ఆదివారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. బి.కొత్తకోటలో మూడు న్నర సంవత్సరాల నుండి అధికంగా పన్నులు మాత్రమే వసూలు చేస్తు ఏమాత్రం అభివృద్ధి చేయకుండా ఉన్నారని అఖిలపక్ష నాయకులు ధ్వజ మెత్తారు. ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకున్నాను గత వైసీపీ ప్రభుత్వం లో స్వలాభం కోసం నగరపంచాయతీగా చేసి పట్టణం లోని ప్రజల నుంచి రూ.కోట్లలో పన్నులు వసూలు చేసి వారి ఆదాయం పెంచుకొన్నారే తప్ప పట్టణ అభివృద్ధి చేసిందేమిలేదని వారు వాపోయారు. గతంలో పంచాయతీగా ఉన్నప్పుడే బి.కొత్తకోటలో ఆర్టీసీ బస్సు డిపో, వ్యవసాయ మార్కెట్ యార్డు ఉండేవని ఇప్పుడు ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా పూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల విస్తరణ, ఆర్టీసీ బస్టాండు, వ్యవసాయ మార్కెట్, పట్టణంలోని నీటి ఎద్దడి తీర్చే వాటర్ ట్యాంకులు లేకున్నను పన్నులు మాత్రం పూర్తిస్థాయి లో వసూలు చేసి సరైన సమయంలో కట్టకపోతే వాటికి వడ్డీల రూపంలో వసూలు చేసి పట్టణంలోని ప్రజల నడ్డి విరుస్తున్నారని వాపోయారు. బి.కొత్త కోటను నగర పంచాయతీగా కొనసాగించాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని అఖిలపక్షం నాయకులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ ఎం పర్వీన్ తాజ్, తంబళ్లపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎం ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, రఘు, అష్రఫ్ వల్లి, బషీర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.కె. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమరవాణా నివారణకు విస్తృత తనిఖీలు:ఎఫ్ఆర్ఓ



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఉత్త ర్వుల మేరకు కడప జిల్లా డిఎఫ్ఓ సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల రేంజ్ అధికారి రఘునాథరెడ్డి, సెక్షన్ అధికారి రమణ ఒక టీమ్‌గా ఏర్పడి రాత్రి వేళల్లో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టుటకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చెక్ పోస్టు లలో సిసి కెమరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని డీఎఫ్ఓ ఆదేశించారు. ప్రతి రేంజ్ పరిదిలో యువఅధికారులను ఒక టీమ్‌గా ఏర్పరచి ఎర్రచందనం పాత ముద్దాయిలను, బెయిల్ పై ఉన్న నేరస్తుల కదలికలను నిశితంగా గమనించి వారు మరల నేరాలకు పాల్పడితే వెంటనే వారిపై వివిధ సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ పెట్టాలని బియ్యపు ఆదేశించినట్లు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ 30 వసంతాల ఆవిర్భావ దినోత్సవం

జమ్మలమడుగు మేజర్ న్యూస్ ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం మంద కృష్ణ మాదిగ 59వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివా రం జమ్మలమడుగు పట్టణంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాం డ్ ఆవరణములో సమతా దళిత్ యునైటెడ్ కమిటీ అధ్యక్షుడు జి.జె. సైమన్ దండోరా జండా ఎగరవేగా దళిత నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య కేక్‌కట్ చేశారు. అనం తరము ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాట్లాడుతూ కోట్లాది బహుజనుల గుండె చప్పుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఒక కుల సంఘము ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి తమ న్యాయ మైన ఏబిసిడి వర్గీకరణ లక్ష్యం కోసం గత 30 సంవత్సరాలుగా నడిపిన సుదీర్ఘమైన ఉద్యమ చరిత్ర భారత దేశంలో ఒక ఎమ్మార్పీఎస్ కే దక్కిందన్నారు. వినూత్నమైన నిరసనలతో దండోరా ఉద్యమం సమా జం లోని అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అండగా ఉంటోందన్నారు. ఎమ్మార్పీఎస్ వల్ల మిగిలిన అనేక కుల సంఘాలు స్ఫూర్తిని పొందాయని అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవం చైతన్యాన్ని నింపింది ముమ్మా టికి దండోరా ఉద్యమమే అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జమ్మల మడుగు నియోజకవర్గ ఇన్చార్జ్ వై.చిన్నయ్య, ఎంఎస్‌పి జిల్లా నాయకులు సుబ్బగాళ్ల నరసిం హులు, వై. చంద్రకుమార్ రామకృష్ణ, మల్లయ్య, పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పుట్టా రవి, ఆర్. శ్రీనివాసులు, డి.దస్తగిరి, రాజేంద్ర, మల్లాంజ నేయులు, ఎంఇఎఫ్ నాయకులు కె. కొండయ్య, కె. బాల ఓబయ్య, పుట్టా శీను, బిజెపి నాయకులు మేకల ఆంజనేయులు, సిపిఐ నాయ కులు ప్రసాద్, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్ప పాల్గొన్నారు.



# మానవతా స్వచ్ఛంధ సంస్థ సేవలు అభినందనీయం

## శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ స్థానిక మానవతా స్వచ్ఛంధ సంస్థ సేవలు అభినందనీయమని శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దొరసానిపల్లె రోడ్డులోని సరస్వతి విద్యామందిరంలో మానవత స్వచ్ఛంధ సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మానవత స్వచ్ఛంధ సంస్థ చేస్తున్న సేవలు తన దృష్టికి వచ్చాయని, వారి సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. నూతన కార్యవర్గం మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ కళావతి, ఆత్యాధ్మిక ప్రవచనకర్త సరస్వతి మాతాజీ, స్వామి శివదర్శనానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ఐఈఆర్‌టిలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డికి వినతి



పెండ్లిమర్రి మేజర్ న్యూస్ 2002 నుండి సమగ్ర శిక్ష సొసైటీలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యాభి వృద్ధి కోసం పనిచేస్తున్న ఐఆర్టీలను గుర్తించి న్యాయం చేయాలని కమలా పురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డికి వినతిపత్రం అందించిన ఐఈఆర్‌టీలు సిద్దారెడ్డి, కరుణాకర్, సుజాత, వీరస్వామి, రత్న ప్రసాద్, ప్రేమకుమారి, లలిత మాట్లాడుతూ ఐఈఆర్‌టిల సేవలను గుర్తించి న్యాయం చేయాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధిస్తునటువంటి ప్రత్యేక ఉపాధ్యాయులను గుర్తించి వారిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని అన్నారు, ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రతి పది మందికి ఒక స్పెషల్ ఎడ్యుకేటర్ తప్పనిసరి 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రతి 15 మంది పిల్లలకు ఒక స్పెషల్ ఎడ్యుకేటర్ అవసరమని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అమలు చేయాలని కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# అమృత నగర్ స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ : కొత్త పల్లి పంచాయతీ పరిధిలో అమృత నగర్ స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజు రెడ్డిని స్థలాలు తీసుకున్న బాధితులు కలిశారు. అనంతరం సిపిఎం కార్యదర్శి సత్య నారాయణ మాట్లాడుతూ 2008, 2018లో దాదాపుగా 2500 మందికి స్థలాలు ఇవ్వడం జరిగింది దాదాపుగా 15 సంవత్సరాల కావస్తుంది అయితే అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు అక్కడ కరెంటు, మంచినీరు, రోడ్లు, హౌసింగ్ లోన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వరదరాజు రెడ్డిని ఆయన ఆఫీసులో స్థలాలు తీసుకున్న లబ్ధిదారులందరూ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. మా సొంత డబ్బులు లక్షలు ఖర్చుపెట్టి బేసి మట్టాలు కొందరు స్లాబ్ లెవల్ వరకు వేసుకోవడం జరిగింది కానీ మౌలిక వసతులు లేవు ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులు ఆగండి తర్వాత మీ సమస్య పరిష్కరిస్తాము ఇప్పుడు ఎవరైనా ఇల్లును పూర్తి నిర్మించుకొని ఉంటే అటువంటి వారికి కరెంటు ఏర్పాటు చేయమని విద్యుత్ డిఈ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి చెప్పడం జరిగింది అన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో హసీనా పుష్పలత నర్సింలు పెంచల్ రెడ్డి హరి డివైఎఫ్ఐ నాయకుడు విశ్వనాథ్ చంటిబాబు మల్లికా భాను పార్వతి గోవిందమ్మ మహిళలు ఉన్నారు.

# మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ : స్థానిక పట్టణ ప్రభుత్వ హాస్పిటల్ నందు రాముడు అనే వ్యక్తి మరణించగా అంత్యక్రియలు చేయడానికి బంధువులు లేకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఆదివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా,. అశోక్, కృపా అగ్నీ శరూన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకటలక్షుమ్మ, సుమన్ బాబు, శ్రీరామ్ పాల్గొన్నారు.

# దళారి అవతారం ఎత్తిన డిటి, సర్వేయర్ : సిపిఐ



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన భూములకు భూసేకరణ ద్వారా అందించే నష్టపరిహారం లబ్ధిదారులకు దక్కకుండా రెవెన్యూ అధికారులు దళారీ అవతారమెత్తి అధి కార దర్పంతో లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పోరుమామిళ్ల సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ ,సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కోడూరు కేశవులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కడపజిల్లా పోరుమామిళ్ళ పట్టణం లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కడప జిల్లా పోరుమామిళ్ళ మండలంలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, పేరమ్మగారి పల్లె, సిద్దవరం, టెకూరుపేట గ్రామాల మీదుగా బెంగుళూరు నుండి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారి కోసం 2022లో అధికారులు భూసేకరణ చేశారు. ఇందు లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కోసం అప్పటి రాజంపేట ఆర్డీఓ కేతన్‌గార్గ్ విచారణచేసి ప్రభుత్వానికి నివేదికను పంపారన్నారు. దీనినే అదునుగా చేసుకున్న పోరుమామిళ్ళ మండల తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సంజీవరెడ్డి, మండల సర్వేయర్ జానీభాషా దళారీ "వింగ్"ఏర్పాటు చేసుకొని లక్షకు 20, 30 వేలు లంచం ఇస్తేనే మీ అకౌంట్లోడబ్బులు పడుతుందని, లేదంటే డబ్బులు పడవన్న రీతిలో హైవే రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంలో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి హైవే రోడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించకపోతే రైతులను కూడ గట్టుకుని తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామనీ, అప్పటికీ స్పందించక పోతే బద్వేలు ఆర్డీఓ, కడప జిల్లా కలెక్టర్, రెవెన్యూ, రోడ్లభవనాల శాఖ మంత్రికి పిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

# అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపింది దండోరా ఉద్యమమే



కమలాపురం మేజర్ న్యూస్ అణగారిన వర్గాలలో చైతన్యం నింపింది దండోరా ఉద్యమమేనని ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్చార్జి నరసింహ మాదిగ అన్నారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జండా ఎగరవేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది బహుజనుల గుండెచప్పుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి తమ న్యాయమైన ఏబిసిడి వర్గీకరణ లక్ష్యం కోసం 30 సంవత్సరాలుగా ఉద్యమచరిత్ర భారతదేశంలో ఒక ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవం చైతన్యాన్ని నింపింది ముమ్మాటికి దండోరా ఉద్యమమే అన్నారు. కార్యక్రమములో ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్నారిగాండ్ల ప్రసాద్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ కమలాపురం మండల అధ్యక్షుడు కోడిగండ్ల భాస్కర్ మాదిగ, విహెచ్పిఎస్ కమలాపురం నియోజకవర్గ అధ్యక్షులు పక్కిరిగాండ్ల సుబ్బ రాయుడు, విహెచ్‌పి ఎస్ కమలాపురం మండల నాయకులు షేక్ షరీఫ్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఎమ్మెస్ కార్యకర్తలు

# ఉక్కు పరిశ్రమను నిర్మించేంతవరకు పోరాటం ఆగదు : డివైఎఫ్ఐ



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ కడప జిల్లా, రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగ, యువతి, యువకుల నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం,వలసల నివారణ కోసం జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాటాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కడప జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అన్నారు. ఇప్పటికైనా కడప జిల్లా ప్రజల యువత ఆకాంక్షను గుర్తించి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించి కేవలం ఎన్నికల శంకుస్థాపనలకు పరిమితం కాకుండా బడ్జెట్ కేటాయించాలని గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా కడప జిల్లా ప్రజల యువత ఆశలకు అనుగుణంగా కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తి చెయ్యాలని వారు కోరారు. కడప ఉక్కు పరిశ్రమ పూర్తి చేస్తే ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 30 నుంచి 50 వేల ఉద్యోగాలు పరోక్షంగా 50వేల నుంచి లక్ష ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు లభించే అవకాశం ఉందని వారు తెలిపారు. సమావేశంలో మహేష్ ఓబులేసు భాష పాల్గొన్నారు

# రేపు మహానేత వైస్సార్ 75వ జయంతి



వీరబల్లి మేజర్ న్యూస్ జులై 6 :తుగ్గలి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు దివంగత మహానేత డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, నాయకులు ప్రజా ప్రతినిధులు, వైస్సార్సీపీ ముఖ్య కార్యకర్తలు తుగ్గలి మండలం కేంద్రమైన స్థానిక వై ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర మండల వైస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా జులై 8వ తేదీన మహా నేత జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నందున వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయా లని తుగ్గలి మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలియ జేశారు.

# సమాజ సేవకే అభి ట్రస్ట్



కమలాపురం మేజర్ న్యూస్ తిప్పులూరు గ్రామంలోని ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఉండే వృద్ధుడు మరణం చడంతో అభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు, మృతుడు ఉరుటూరుకు చెందిన నారపురెడ్డి (75) సంవత్సరాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందగా ఈ విషయాన్ని ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్ర, చరవాణి ద్వారా అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్ విజయ బాబుకు తెలుపగా అక్కడికి వెళ్లి ట్రస్ట్ మెంబర్లతో కలిసి సాంప్రదాయ పద్ధతిలో అంతక్రియలు నిర్వహించారు, మాకు ఎన్ని కష్టాలున్నా ఎదుర్కొంటూ మానవత్వంతో దైవానుగ్రహంతోనే కార్యక్రమాలన్నీ ట్రస్ట్ ద్వారా చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమల్‌భాష, శివ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలి



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ సెలవు రోజుల్లో విద్యార్థులు గ్రంధాలయానికి వచ్చి అందు బాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానవంతులు కావాలని పోరుమామిళ్ల గ్రంథాలయ అధికారి అఫ్రిది,రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పిలుపునిచ్చారు. ఆదివారం సెలవు రోజులలో విద్యార్థులు గ్రంధాలయానికి రావాలని కోరారు. ఆదివారం గ్రంథాలయాలనికి వచ్చిన విద్యార్థులు దినపత్రికలు, కథల పుస్తకాలను చదివినట్లు గ్రంథాలయ అధికారి అఫ్రిది తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజులలో విద్యార్థుల కోసం వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు రంగనాయకులు, సంజీవ రెడ్డి, పవన్ కుమార్, ఖాజావలి పాల్గొన్నారు.

# అధిష్టానం సైలెంట్..నాయకులు వైలెంట్..!

మొదటి పేజీ తరువాయి

టిడిపి నాయకుల పై తమ అనుకూల వారిని ఉసిగొలుపుతూ వారిపై విమర్శలు చేస్తున్నారు. మరి ఇంతే తెగువ తెగింపు గడిపిన ఎన్నికలలో చేసి ఉంటే విజయం దక్కదని, అలాకాకుండా ఇప్పుడు రాజంపేటపై పెత్తనం కోసం కొందరు నాయకులు ఇలా తమ పైత్యాన్ని కార్యకర్తలు నాయకులపై రుద్దడం ఏంటని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మరి వీరి ఉనికి కోసం ఆరాటం, వీరి పైత్యంతో పార్టీకి కలిగే నష్టం బేరీజు వేసుకొని అధిష్టానం మంచి నిర్ణయం తీసుకోవాలని పలువురు కార్యకర్తలు కోరుతున్నారు.

**ఇంటలిజెన్స్ సమాచారం అంటూ తప్పుడు ప్రచారాలు**

రాజంపేట నియోజకవర్గంలో కొందరు నాయకులు తమకు ఇంటలిజెన్స్ సమాచారం ఉందని, అధిష్టానం తమకే మద్దతుగా నిలుస్తుందని ప్రకటనలు చేయడం పట్ల పలువురు టిడిపి కార్యకర్తలు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు ఇంటలిజెన్స్ గాని, అధిష్టానం గానీ రాజంపేటపై దృష్టి సారించిందో లేదో తెలియదు కానీ వారి పేరు చెప్పి మాత్రం రాజంపేట నియోజకవర్గంలో అసత్యాలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. అసలు ఇంటలిజెన్స్ నుండి సమాచారం సేకరిస్తే ఇతరులకు ఎలా సమాచారం అందుతుందో అర్థం కాని విషయం గా మారింది. కేవలం రాజంపేట నియోజకవర్గంలోని టిడిపి నాయకులను కార్యకర్తలను అయోమయంకి గురిచేసి పబ్బం గడుపుకోవాలని కొందరు నాయకులు చేస్తున్న జిమ్మీక్‌లలో భాగంగానే ఇలాంటి తప్పుడు ప్రకటనలు వస్తున్నాయని, అధిష్టానమే పార్టీకి ఏది మంచిదనిపిస్తే ఆ నిర్ణయమే తీసుకుంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**పాలనపై ప్రత్యేక దృష్టి.. రాజంపేట పై కాదు...**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే కొంతమేర అధికారులను మార్చి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని చిత్తశుద్ధితో పని చేస్తు ముందుకు కదులుతున్నారు. ప్రస్తుతం అధిష్టానం చూపు మొత్తం రాష్ట్రంలో పాలను గాడిన పెట్టడంలోనే ఉంది. రాజంపేట పై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని అధిష్టానం పెద్దలు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ఇక్కడ మాత్రం రాజంపేట బాధ్యత నాదంటే నాదంటూ ప్రచారాలతో ఊదరగొడుతున్నారు. ప్రస్తుతానికైతే రాజంపేట ఇన్‌చార్జిగా ఒకరు కొనసాగుతుంటే, మరొకరికి కేటాయించాలంటే అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వవలసి ఉంది. మరి అధిష్టానంతో పని లేకుండా, ఆదేశాలతో అవసరం లేకుండా మరి ఇతర నాయకులను ఇబ్బంది పెట్టేలా, తమ ఉనికిని రాజంపేటలో నిలుపుకునేందుకు నాయకులు పడుతున్న కష్టాలు చూస్తుంటే ఆశ్చర్యంతో పాటు నవ్వు కూడా కలుగుతుంది. మరి రాజంపేట నియోజకవర్గంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఎవరికి మద్దతు ఇస్తే వారే ఇక్కడ పెత్తనం కొన సాగించే అవకాశం ఉంది. ఈ మధ్యలో చేస్తున్న జిమ్మిక్కులకు ప్రజలు ఎంటర్టైన్ అయితారేమో కానీ అధిష్టానం మాత్రం స్పష్టమైన అవగాహనతో రాజంపేట పై ముందుకు కదులుతుంది. మరి చూడాలి సొంత పైత్యాన్ని కార్యకర్తలు నాయకులపై రుద్దేందుకు, ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్న నాయకులకు ఎటువంటి ఫలితాలు లభిస్తాయో. మొత్తానికి అసలు ఎటువంటి సమాచారం ఇవ్వని ఇంటలిజెన్స్, టిడిపి అధిష్టానం పేరు చెప్పుకొని రాజంపేటలో మాత్రం చాలామంది దర్జాగా బతికేస్తున్నారు. మరి అన్ని గమనిస్తున్న టిడిపి నాయకులు కార్యకర్తలు భవిష్యత్తులో ఎటువంటి సమాధానం ఇస్తారో వేచి చూడాలి.

# మండల అభివృద్ధికి కృషి చేయాలి

మొదటి పేజీ తరువాయి

సంరక్షణ పనులను వేగవంతం చేయాలన్నారు. సంబేపల్లి మండలంలో ఎన్ని మంచినీటి పథకాలు పనిచేస్తున్నాయి ఎన్ని బోర్లు ఉన్నాయి తదితర వివరాలు సమర్పించి మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామి పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాల న్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యని హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. సంబేపల్లి మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఇల్లు మంజూరయ్యాయి, ఎన్ని ప్రారంభించారు. ఇంకా ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయి. తదితర వివరాలను 15 రోజుల లోపల తమకు పంపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. మండలంలో డాక్టర్లు, సిబ్బంది సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. రెవిన్యూ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పనులు చేయాలన్నారు. మండలంలో చాలావరకు భూ ఆక్రమణలు జరిగాయని ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆక్రమణలకు గురైన భూముల వివరాలను నెల రోజుల లోపల తమకు పంపాలన్నారు. గతంలో రోడ్లు వేయకుండా బిల్లులు చేయడం జరిగిందని ఇలాంటివన్నీ అధికారులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంబేపల్లి మండలం, గుదియవాండ్లపల్లి గ్రామంలో దాతలు స్థలం ఇచ్చినప్పటికీ ఇక్కడ అంగన్వాడి భవనాన్ని నిర్మించేందుకు అధికారులు నిర్లక్ష్యం చేయడం జరిగిందని వెంటనే భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాల న్నారు. త్వరలో నియోజకవర్గం వారీగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని అధికారులందరూ తమ పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నిర్మలాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక స్టాక్ అమ్మకాలు పటిష్టంగా పారదర్శకంగా చేపట్టండి

**జ్యోతి ఇసుక స్టాక్‌యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్**



సిద్ధవటం, మేజర్ న్యూస్ : జిల్లాలో గుర్తించిన ఇసుక స్టాక్ యార్డ్ ల వద్ద రేపటినుండి పటిష్టంగా, పారదర్శకంగా అమ్మకాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు.ఆదివారం సిద్దవటం మండలం జ్యోతి గ్రామం లోని ఇసుక స్టాక్ యార్డును రెవెన్యూ,పోలీసు అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక విధాన నిబంధనల ప్రకారం ఇసుక అమ్మకాలు జరపాలని అధికారులకు ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. జ్యోతి ఇసుక స్టాక్ యార్డును మూడు పాయింట్లుగా ఏర్పాటు చేసుకొని రేపటి నుంచి అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక స్టాక్ యార్డ్ వద్ద మూడు షిఫ్టువిధానంలో మొదటి షిఫ్ట్ పంచాయతీ సెక్రటరీ రెండో షిఫ్ట్ షిఫ్ట్ డిజిటల్ అసిస్టెంట్ మూడో షిఫ్ట్ వెల్ఫేర్ సెక్రటరీలతో పాటు పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండాలన్నారు. ఇసుక స్టాక్ యార్డ్ పాయింట్ వద్ద టెంట్ ఏర్పాటు చేసుకుని పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఇసుక డిమాండ్ ను బట్టి అన్ని విధాలుగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గుర్తించిన ఇసుక స్టాక్ యార్డ్ ల వద్ద 24 గంటలు పర్యవేక్షణ ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే జ్యోతి గ్రామంలో లోని గ్రామస్తులతో కలెక్టర్ ముచ్చటించారు. గ్రామంలోని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.త్రాగునీరు, శానిటేషన్, క్లాప్ మిత్ర వంటి అంశాలపై ఆరా తీశారు. గ్రామంలోని స్ట్రీట్ లైట్లపై ఆరా తీసి పగటి పూట స్ట్రీట్ లైట్ వెలుగ కుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ఎక్కువగా నీరు నిలిచి చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలపడంతో కలెక్టర్ వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపాలని డిజిటల్ అసిస్టెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మురుషా వల్లి, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ పురుషోత్తం రాజు సిద్ధవటం ఎస్సై పెద్ద ఓబన్న రెవిన్యూ ఇన్స్పెక్టర్ అనురాధ ఏపీఎం వెంకటేశ్వర్లు వీఆర్వో శ్యాంబాబు పోలీసు అధికారులు, సర్పంచ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఉద్యమానికి పునాది వేసిన మందకృష్ణ



చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్: మాదిగల ఉద్యమానికి పునాది వేసి అన్నగారిని కుటుంబాలకు అండగా నిలిచిన మందకృష్ణ మాదిగని పి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. ఆదివారం మహావీర్ సర్కిల్లో మందకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మాత ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం అంగరంగ వైభవంగా. కవాతు చేస్తూ. నినాదాలు చేస్తూ. పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం. యాచకులకు అన్నదానం చేస్తూ. బాణసంచాలు పేలుస్తూ.. అణగారి వర్గాల ఆశా జ్యోతి. దళిత జాతి మాన్యశ్రీ మందకృష్ణ మాదిగా.అన్న జన్మదిన వేడుకలకు వికలాంగులు మేము సైతం స్కూటర్ల పై ఎమ్మార్పీఎస్ అనుబంధా.సంఘాలకు మద్దతు తెలుపూ వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య గారి ఆధ్వర్యంలో.వికలాంగుల సైతం వందలాదిమందిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం చిన్న సుబ్బయ్య యాదవ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అనగారిన వర్గాల ఆశ జ్యోతి పేద బడుగు బలహీన వర్గాల. నాయకుడు. ఆరోగ్యశ్రీ ప్రధాత. వికలాంగులకు అండగా నిలబడ్డ ఉద్యమ వీరుడుగా. 30 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో. బడుగు బలహీన వర్గాల కోసం. అహర్నిశల్ శ్రమించిన. మాదిగ జాతి ముద్దుబిడ్డ మంద కృష్ణ మాదిగ అన్నగారు. కడప జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల తరఫున. పుట్టినరోజు సామాజిక ఉద్యమ నమస్కారాలు తెలియజేసుకుంటున్నాం ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ వీ హెచ్ పి ఎస్ . కడప జిల్లా దుంపలగట్టు మాతయ్య. ఎంఎస్‌పి మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత ముఖ్య అతిథులుగా పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించీ కేక్ కట్ చేసి. యాచుకులకు అన్నదానం చేసి. ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లు. ఎంఎస్‌పి మైదుకూరు నియోజవర్గం అధ్యక్షురాలు. మంజుల నగర అధ్యక్షుడు ప్రసాద్ నాగయ్య లలిత ప్రేమలత తులసి ఆంజనేయులు రెడ్డి బాబు వెంకట రమణ, ఎల్లారెడ్డి, ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి పాలగిరి కొండయ్య. మహిళా నాయకురాలు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సమన్వయముతో పని చేసి విజయవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ..నిల్వ కేంద్రాల్లో ఉన్న స్టాక్ యార్డ్ నుంచి ఇసుకను అందచేయాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ఆదాయం తీసుకోకుండా నిర్వహణ ఖర్చులు, సీనరేజ్ మాత్రమే వసూలు చేసి వినియోగదారులకు అందచేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. నూతన ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ సి)ను ఏర్పాటు చేసిందని..ఇందులో ఛైర్మన్‌గా కలెక్టర్ కాగా ఎస్పీ, జేసీ, ఆర్డీవోలు, జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారి, డీపీవో, డీటీసీ, తదితరులు సభ్యులుగా ఉండగా జిల్లా గనులు, భగర్భ వనరుల శాఖ డిడి మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 11 స్టాక్ యార్ధులలో సిద్ధంగా ఉన్న ఇసుకను..ఆయా నిల్వ కేంద్రాల (స్టాక్ యార్ధులు) నుండి కొండాపురం మండలంలోని కే. వెంకటాపురం, పి. అనంతపురం నుండి టన్నుకు రూ.340లు, కమలాపురం టన్నుకు రూ.341లు, సిద్దవటం మండలంలోని జ్యోతి టన్నుకు రూ.340లు, బద్వేల్ టన్నుకు రూ.468లు, పోరుమామిల్ల టన్నుకు రూ.587లు, పెండ్లిమర్రి మండలంలో పడగాలపల్లి, కొత్తూరు లలో.. టన్నుకు రూ.340లు, వి.ఎన్.పల్లి మండలంలోని ఎర్రబల్లి టన్నుకు రూ.340లు పులివెందుల టన్నుకు రూ.468లు, మైదుకూరు టన్నుకు రూ.400ల చొప్పున వినియోగదారు లు రవాణా ఛార్జీల కింద చెల్లించాల న్నారు. ఈ రుసుం కూడా జిల్లా కలెక్టర్, జిల్లా గనులశాఖ అధికారి పేరిట సంయుక్తంగా తెరిచిన బ్యాంకు ఖాతా నంబర్ ఎస్.బి.ఐ 43131042192,IFSC SBIN0011122 (కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్)కు చెల్లించాలన్నారు. ఇసుక కావలసిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ నంబరుతో బుక్ చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని డిఆర్డీఏ పీడి ఆనంద నాయక్‌ను ఆదేశించారు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు ఇసుక పంపిణీ ను పారదర్శకంగా నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నెం.08562 -246344.ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు ఏమైనా అసౌకర్యం కలిగితే కంట్రోల్ రూమ్ నెంబరుకు ఫోన్ చేయవచ్చు నన్నారు. నిర్దేశించిన నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ సందీప్ రెడ్డి, అదనపు ఎస్పీ సుధాకర్, ఏఎస్పీ వెంకటరమ ణ, డిఆర్వో గంగాధర్ గౌడ్, గనులు భూగర్భ శాఖ ఇంఛార్జి డిడి రవి ప్రసాద్, డిటిసి మీరా ప్రసాద్, హౌసింగ్ పిడీ కృష్ణయ్య, జడ్పి సీఈఓ సుధాకర్ రెడ్డి, డిపివో ప్రభాకర్ రెడ్డి, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పాటుపడతా

## మల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే, ముక్కా కుటుంబం





పుల్లంపేట, మేజర్ న్యూస్ పుల్లంపేట మండలం రంగంపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామ ఆడబిడ్డగా అందరికీ మంచి చేస్తామని, గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి ముక్క వరలక్ష్మి తెలియజేశారు. ఆదివారం గొల్లపల్లి గ్రామంలోని గ్రామ దేవత మల్లాలమ్మ ను రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తో కలిసి కుటుంబ సమేతంగా ఆమె దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మల్లాలమ్మకు ముక్కా కుటుంబం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిలిస్తే పలికే దేవత గా మల్లాలమ్మ తల్లి ని రంగంపల్లి పంచాయతీ లోని 7 గ్రామాల ప్రజల అనునిత్యం పూజలు చేస్తుంటారని,రంగంపల్లి గొల్లపల్లి ఆడబిడ్డ అయిన నేను కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో గ్రామానికి కావలసిన అన్ని వస్తువులు సదుపాయాలు కల్పించేందుకు ముందుంటానని, ఆలయ అభివృద్ధికి కూడా కృషి చేస్తానని వారు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి దయతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామాలు ప్రశాంత వాతావరణంలో ముందుకు సాగాలని, అందరి ఆశీస్సులతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో విజయం సాధించగలిగామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషి చేస్తామని, అలాగే ఈ గ్రామానికి వచ్చినప్పుడు తమకు అనేక జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని, ఈ గ్రామ ఆడబిడ్డగా ఈ గ్రామ అభివృద్ధి తమ లక్ష్యం అని, అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామాన్ని తమ సొంత గ్రామంలో అభివృద్ధి చేసుకుంటామని ఆమె తెలియజేశారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచు కుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకే వెంకటసుబ్బారెడ్డి, ఎస్. రెడ్డయ్య రెడ్డి, కంచర నరసింహా రెడ్డి, నాయుడు రామయ్య, పసుపులేటి శివ కుమార్, కొమ్మన రామిరెడ్డి, నాగిరెడ్డి ధర్మా రెడ్డి, వెంకటరమణ, రమేష్, రొంపిచర్ల మురళి, వర్దన్న గారి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి కేంద్రం వద్ద పొంచి ఉన్న ముప్పు



రాజంపేట,మేజర్ న్యూస్ రాజంపేట, మన్నూరులోని జాంద్రపేట అంగన్ వాడి కేంద్రం పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం తో ప్రాణాపాయం పొంచి ఉంది. పక్కనే చిన్నారులు చదువుకునే అంగన్ వాడి కేంద్రం ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె వేయాలన్న ఆలోచన అధికారులకు లేదు. అంగన్ వాడి కేంద్రంలో 48 మంది చిన్నారులు చదువుతున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు కావడంతో కంచెలేని ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. దీనిపై గతంలో పట్టణంలోని మన్నూరు సాయి నగర్ ఈడిగి పాలెం ప్రాంతాల్లో కూడా ట్రాన్స్ఫార్మర్లకు కంచలేని ట్రాన్ఫార్మర్లు దర్శనమిస్తాయి ముఖ్యంగా మన్నూరులోని జాంద్రపేట అంగనవాడి చిన్నారి విద్యార్థుల తల్లిదండ్రులు ఏఈకి, ఏడికి, డిఈఈకి ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించు కోలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ముళ్ళ కంచె వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## హైకోర్టు జూనియర్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నాగార్జున



కడప అర్బన్ మేజర్ న్యూస్: బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల టౌన్‌కు చెందిన రావుల వెంకట సుబ్బమ్మ మనవడు రావులపెద్ద నాగేశ్వర రావు, రావుల పద్మావతి కుమారుడు రావులనాగార్జున హైకోర్టులో ది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) డిపార్ట్మెంట్ తరపున వాదనలు వినిపించడానికి నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుండి ఈనెల 4న ఉత్తర్వులు జారీ అయ్యాయి. రావుల నాగార్జున పాఠశాల విద్యాభ్యాసం పోరుమామిళ్లలోని సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో, న్యాయ శాస్త్రం ఆంధ్ర క్రిస్టియన్ కాలేజ్ గుంటూరు నందు పూర్తి చేశారు. 2021-22 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసి యేషన్‌కు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరూగా ఎన్నికై తన సేవలు అందించారు. రావుల నాగార్జున నియామపట్ల కుటుంబ సభ్యులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు

## మోహన్ బాబు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



చింతకొమ్మదిన్నె మేజర్ న్యూస్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం మోహన్ బాబు తల్లి గంధం సరోజనమ్మ మృతి చెందడంతో ఆదివారం కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మోహన్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాడ సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ రెడ్డి,టిడిపి నాయకులు హరి ప్రసాద్, కృష్ణారెడ్డి, శివ శంకర్, జెబిఉల్లా, బ్రహ్మానంద రెడ్డి, రాజా, భాస్కర్, నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## ఎక్కడి చెత్త అక్కడే

### మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం...ప్రజలకు శాపం



రాజంపేట మేజర్ న్యూస్ మన్నూరు ప్రధాన జడ్పీ హైస్కూల్ వెనుక భాగంలో ఉన్న ప్రధాన రహదారి పక్కన చెత్తను, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు డ్రైనేజీ కాలువలో పూడిక తొలగించడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణవాసులు మాట్లాడుతూ. పన్ను రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న కూడా ప్రజలకు సరైన సౌకర్యం కల్పించడంలో మున్సిపాలిటీ అధికారులు విఫలం అయ్యారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మురికి వల్ల విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని , ఎన్ని సార్లు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి చెత్తను కాలువల్లోని పూడికను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## వ్యవసాయాధికారులూ... తనిఖీలు చేపట్టండి

రైల్వేకోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు పట్టణంలో శనివారం జరిగిన ఎరువుల దుకాణాలపై వ్యవసాయ అధికారులు మెరుపు దాడులు సక్రమంగా జరగలేదని మండలములోని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా నాసిరకపు ఎరువులు క్రిమిసంహారక మందులు పూర్తిస్థాయిలో నాసిరకంగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కేవలం తూతూ మంత్రంగా జరక్కుండా పూర్తి స్థాయిలో నిజాయితీగా ఎరువు దుకాణాలను, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఇటీవల రైల్వేకోడూరు పట్టణంలో ఒక ఎరువుల దుకాణం బొప్పాయి విత్తనాలు పూర్తిస్థాయిలో మేల్ విత్తనాలు ఇవ్వడంతో ఉప్పరపల్లి కి చెందిన ఒక రైతు బొప్పాయి పంటను చూసి పూర్తిగా నివ్వెర పోయాడు. ఏమని విచారణ చేపట్టగా ఆ విత్తనాలు మేల్ విత్తనాలని తెలియ డంతో రైతు దిక్కుతోచని స్థితిలో అప్పులు చేసి రైతు కృంగి పోయాడని ఆల స్యంగా తెలిసింది. కోడూరు పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాలు పూర్తి స్థాయిలో నాసిరకంగా నకిలీగా చలామణి అవుతున్నాయని రైల్వే కోడూరు మండలం లోని వ్యవసాయ రైతులు పూర్తిస్థాయిలో ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అధికారులు సక్రమంగా తనిఖీలు చేయకపోవడం జరిమానాలు విధించకపోవడం ప్రధాన కారణమని కూడా రైతులు అంటున్నారు. కొంతమంది ఎరువుల దుకాణాల యజమానులు దాదాపు మారుమూల ప్రాంతాలలో స్టాకు పెట్టుకుని అవసరమున్న చోటనే గుర్తింపు కలిగిన విత్తనాలను ఉంచుకొని మిగతా వేరే గోడములలో స్టాక్ ఉంచుకొని వ్యాపారాలను రహస్యంగా చేపడుతున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు చొరవ చూపి నకిలీ ఎరువుల అంగళ్లపై దృష్టి సారించాలని రైతులు కోరుకుంటున్నారు.

## కేశాలు దానం చేసిన గృహిణి నాగవేణి

### అభినందించిన అబూబక్కర్ సిద్దిక్




మదనపల్లె,మేజర్ న్యూస్ : మదనపల్లి ముఖ్య కేంద్రంగా రక్తదానం,ఫుడ్ బ్యాంక్స్,సానిటరి ప్యాడ్ బ్యాంక్స్,బాడీ ఫ్రీజర్ బాక్స్ సేవలతో పాటు క్యాన్సర్ భాదితులకు మానసికంగా అయిన తోడుగా నిలవాలనే గొప్ప ఆశయంతో హెల్పింగ్ మైండ్స్ హెయిర్ డొనేషన్ కార్యక్రమంకు మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేసి గొప్ప మనస్సును చాటుకుం టున్నారు. మదనపల్లెకు చెందిన నాగమణి హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి క్యాన్సర్ బాధితుల కోసం కేశాలు దానం చేసిన నాగవేణికు ప్రశంస ప్రశంస పత్రంతోపాటు పూలమొక్క బహుకరించి హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందించింది.ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ మహిళల అందంలో సగభాగమయిన కేశాలను క్యాన్సర్ బాధితుల కోసం దానం చేయడానికి ఇప్పటికి 49 మంది ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని, రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ భాదితులకు తమ సంస్థ ద్వారా విగ్గులు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మ ప్రియ,సుజాత,హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్ పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సహజం



కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్: హైస్కూలు విద్యార్థులకు వారసత్వ స్పృహను కల్పించాలని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి విద్యా శాఖ ప్రతినిధు లను కోరారు. ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు జవ్వాజి రమాదేవి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిన్నపరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైం దన్నారు. బాల్యం నుంచే పిల్లలకు మన దేశ సంస్కృతి, సంప్రదా యాలు, వార సత్వ సంపద గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల విద్యా శాఖ అధికారులు వెంకట్రామిరెడ్డి, రమాదేవి, వైవీయూ పాలకమండలి సభ్యుడు మూలమల్లికార్జున రెడ్డి, ఎల్లేశ్వరరావు, ఉపాధ్యా యులు, ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

## మెగా ఉచిత కంటి వైద్య శిబిరం



రాయచోటి, మేజర్‌న్యూస్: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నాడు సుమారుగా 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ శివారెడ్డి తెలియజేశారు. అందులో 50 మందికి శస్త్ర చికిత్సలు చేసేందుకు వైద్యులు నిర్ధారించారని వారిని రాయచోటి మీదుగా ఈ మధ్యాహ్నం బయలుదేరి సోమవారం మధ్యాహ్నం కి శస్త్ర చికిత్సను గావించి తదుపరి వారికి అవసరమైనటువంటి అద్దాలను అందించి తర్వాత తిరిగి వారిని రాయచోటికి చేర్చడం జరుగుతుందన్నారు. అనంతరం లయన్ వ్యవస్థాపక అధ్యక్షులు పిఎస్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మండల వారీగా నిర్వహిస్తామని అంధత్వ నివారణని ముఖ్య ఉద్దేశంగా చేపడతామని తద్వారా మారుమూల ప్రజలకు ఈ అవకాశాన్ని అందిస్తామని తెలియజేశారు. అనంతరం జోన్ చైర్మన్ లయన్ మహమ్మద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సద్వినియోగపరచు కోవాలని పేద ప్రజలందరికీ ఈ అవకాశం కల్పిస్తామని మరెన్నో కార్యక్రమాలు కూడా చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఉదయం అల్పాహారము మరియు మధ్యాహ్నం భోజనాన్ని లయన్ వీరయ్య , అలాగే లయన్ ప్రసాద్ నాయుడు దాతృత్వం తో అందించారని కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి హరీష్ చంద్ర, లయన్ నారాయణ రెడ్డి,లయన్ మిక్కిలి నేని ప్రసాద్ నాయుడు, మాజీ అధ్యక్షులు లయన్ చాన్ బాషా,లయన్ కిషోర్ కుమార్,మానవతా శివగంగ రెడ్డి ,మనవతా అధ్యక్షులు ఖాదర్ భాషా,నూకల రవీంద్ర,పాల్గొన్నారు అలాగే ఎస్వి కంటి ఆసుపత్రి డాక్టర్లు గాయత్రి, చైతన్య ,సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు వరుసల రహదారిపై కేంద్రంలో కదలిక

### పురోగతిలో వేంపల్లి, పొద్దుటూరు,చాగలమర్రి రోడ్డు



రాజుపాళెం,మేజర్‌న్యూస్: ఈ ప్రాంతంలో నిలిచిపోయిన జాతీయ రహదారుల నిర్మాణాల పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలో కదిలిక తీసుకు వచ్చినట్లు తెలిసింది ఈ రహదారుల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.ప్రధానంగా కడప జిల్లాలోని వేంపల్లి,ప్రొద్దుటూరు, రాజుపాళెం మీదుగా చాగలమర్రి వరకు రెండు వరసల హైవే రోడ్డు నిర్మాణం పురోగతి కనిపిస్తోంది.ఈ జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వం రూ1321 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు .రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిన బిడ్ ను తెరచలేదు ఆ నిధులలోనే ఈ రహదారి నిర్మాణానికి భూమి కోల్పోతున్న వారికి నష్టపరిహారాన్ని కూడా చేర్చారు.ఇప్పుడున్న రోడ్డును రెండు వరుసల రహదారిగా తీర్చిదిద్దెకు హద్దులను కూడా నిర్ణయించారు.భూమిని కొలపోతున్న రైతుల వివరాలను రెవిన్యూ అధికారులు సిద్ధం చేశారు. రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పో తున్న వారికి సరైన నష్టపరిహారం నిర్ణయించి అవార్డు ప్రకటించాల్సి ఉంది. వీలైనంత తొందరగా భూమి కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లిస్తేనే ఈ రహదారి నిర్మాణం ప్రక్రియ ముందుకు సాగుతుంది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, వేంపల్లి వరకు ఇప్పటికే రెండు వరుసల రోడ్డు నిర్మాణం మొదలైంది అక్కడి నుండి వేంపల్లి,ప్రొద్దుటూరు మీదుగా నంద్యాల జిల్లా పరిధిలోని మండల కేంద్రమైన చాగలమర్రి వద్ద జాతీయ రహదారి నెంబర్–40 కి ఈ రెండు వరుసల రహదారిని అనుసంధానం చేస్తారు 79 కిలోమీటర్ల మేర ఇప్పుడున్న రోడ్డును రెండు వరుసల రహదారిగా తీర్చిదిద్దుతారు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నేషనల్ హైవే అథారిటీ రెవెన్యూ యంత్రాంగం అనుకున్న లక్ష్యాలను పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో రెండు వరుసల రహదారి నిర్మాణంతో అభివృద్ధి చెందుతుంది.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు



కాశినాయన, మేజర్‌న్యూస్ : కాశినాయన మండలం నాయన పల్లె గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనారు తలారి నరసింహారావు, తలారి నాని అనే విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లా నందిగాం కె.వి.ఆర్ కాలేజీలో జరిగినటువంటి రాష్ట్రస్థాయి వాలీబాల్ స్టేట్ చాంపియన్షిప్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించారు త్వరలో జరగబోయే రాజస్థాన్ లో నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఈ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు అదే గ్రామానికి చెందిన మున్నెల్లి చెక్కభజన గురువు పెద్ద ఓబులేసు గారి కొడుకు మున్నెల్లి ప్రసాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, చెక్కభజన గురువు కూడా కడప పట్టణంలో విద్యార్థిని విద్యార్థులకు కోలాటం, చెక్కభజన నేర్పిస్తూ ఆటలలో కూడా మంచి పేరు ప్రతిష్టలను పొందారు అలాగే కడప జిల్లా వాలీబాల్ కోచ్ ఉన్నారు. ఈ సందర్భంగా నాయన పల్లి గ్రామంలో రాష్ట్రాలు గోల్డ్ మెడల్ సాధించి విద్యార్థులకు జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ప్రజలందరూ ఆనందంగా హర్షం వ్యక్తం చేశారు.

## ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యం

### మానవత వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బోర్డు సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఎంతో మంది నిస్సహాయులకీ చేయూత అందించామని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలు చేసే విధంగా కార్యాచరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఉత్తమ సమాజ నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవియూ రిట్కెర్డ్ ప్రిన్సిపాల్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం సమాజ శ్రేయస్సు కోసం, సమాజంలోని నిస్సహాయులకు అండగా నిలుస్తున్న మానవత సేవలు ప్రశంసనీయమన్నారు. మానవత ద్వారా ఉత్తమ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మానవత వేంపల్లెశాఖ అధ్యక్షునిగా ఎన్నుకోవడం, సంతోషం కలిగించిందన్నారు. కార్యవర్గ సభ్యులందరి సహకారంతో మానవత సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, నిస్సహాయులకీ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాగే కార్యవర్గ పూర్వపు అధ్యక్షుడు చల్లా బాలాజీ మాట్లాడుతూ తన కార్యవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టామని, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డైరెక్టర్ రాటాల గోపి, వేంపల్లె శాఖ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి కృషి

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీఓలు, జిల్లా అధికారుల బృందం, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అందరి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లా అభివృద్ధికి పాటు పడతామని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ సత్యనారాయణ రావులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని ఆర్డీవోలు, పలువురు జిల్లా అధికారులు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, పాత్రికేయులు, ప్రముఖులు తదితరులు పుష్పగుచ్చాలు, పూల మొక్కలతో జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికి తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ



మైదుకూరు, మేజర్‌న్యూస్ : శనివారం రాత్రి సబ్‌డిఫ్ఓ హేమాంజలి, ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ ప్రణీత్‌రావు, వనిపెంట ఎఫ్ఆర్ఓ, సిబ్బందితో కలసి ఎర్రచందనం పరిరక్షణలో భాగంగా ప్రధాన కూడళ్ళలో బాసాపురం టోల్ ప్లాజా కూడలి ఖాజీపేట, మైదుకూరు, వనిపెంట రహదారుల దగ్గర ఆకస్మిక నాకాబంది నిర్వహించి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇలాగే నిత్యం తనిఖీ చేస్తామని ప్రొద్దుటూరు సబ్‌డిఫ్ఓ దివాకర్ తెలిపారు.

## యువకుడు దారుణ హత్య

### గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని అనుమానాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రాయచోటి, మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం ఆదివారం నాడు యువకుడి గొంతు కోసి హత్య చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం సిద్ధిక్ మసీద్ వెనుక ప్రాంతంలో నివాసముంటున్న రెడ్డి భాష కుమారుడు అబ్దుల్ రహీం (22) ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి చేశారని ఆయన తెలిపారు. మృతుడు అబ్దుల్ రహీం ఒక కోళ్ల ఫారం దుకాణంలో పనిచేసేవాడని ఆయన తెలిపారు. మృతున్ని గొంతు కోసి కళ్ళను గాయపరిచినట్లు ఆనవాలు ఉన్నాయని ఆయన తెలిపారు. మృతుని తండ్రి రెడ్డి భాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు.

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నందలూరు మేజర్‌న్యూస్ : మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి కార్యాలయం నందు కలిసి నందలూరు మండలం శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికిన విజయ శేఖర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి దిలీప్, నందలూరు మండల మాజీ మండల అధ్యక్షులు భువన బోయిన లక్ష్మీ నరసయ్య, చింతకాయ పల్లి ఎంపీటీసీ భువన బోయిన పెంచలయ్య, ఎల్లంరాజు పల్లి సుబ్బారెడ్డి, రాము యాదవ్ పాల్గొన్నారు.

## తవ్వాను అభినందించిన వైఎస్ జగన్



కడప కల్చరల్, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వరాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జీవితం పై రచించిన 'ఓ ధీరుడి పయనం': సమరం నుండి సంక్షేమం వైపు అనే పుస్తకాన్ని మాజీ సిఎం వైయస్. జగన్ పులివెందులలో తమ స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటయ్య చేసిన కృషిని కొనియాడుతూ ప్రత్యేక అభినందనలు అంద జేశారు. కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాజకీయ రంగంలో అంచలంచలుగా ఎదిగిన వైనాన్ని చాటి చెప్పిన వెంకటయ్యను ప్రశంసించారు. ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రసంగిస్తూ దళిత కుటుంబంలో పుట్టిన వెంకటయ్య తెలుగులో డాక్టరేట్ పూర్తి చేసి సాహిత్యకారులకు, పరిశోధకులకు, విమర్శకులకు, కథా రచయితలకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన అనేక వ్యయ ప్రయాసలకోర్చి జగన్మోహన్ రెడ్డి పై పుస్తకము రాయడం అభినందనీయమన్నారు. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వెంకటయ్య రాయలసీమ కథా సాహిత్యం పై పరిశోధన చేసి అనేక నూతన అంశాలను వెలుగులోకి తెచ్చి రాయలసీమ కథా సాహిత్య చరిత్రను తిరగరాసారన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మాజీ ఎమ్మెల్యే పోచమ రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రెడ్యం చంద్రశేఖర రెడ్డి, నేట్లపల్లి శివరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి-సిపిఐ




బద్వేలు మేజర్ న్యూస్: బద్వేలు పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ నగర్ కాలని ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు అవుతుందని అయితే ఇప్పటికీ ఏ అధికారులు పట్టించుకోలేదని భారత కమ్యునిస్టు పార్టీ సిపిఐ కార్యాలయం జేవి భవన్ లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ నగర్ కమిటీ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్ అన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా భగత్ సింగ్ నగర్ వాసులు విషసర్పాల మధ్య కాపురం చేశారని ఎండకు ఎండి వానకు తడిచి త్రాగడానికి సరైన నీరు లేకపోయినా చిన్నపాటి గుడిసెలు వేసుకుని వున్నారని అయితే చిన్నగా రూమ్ లు నిర్మించుకున్నారని 10 సంవత్సరాల నుండి ఏ అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదని మేము ఇంటి పన్నులు కడతాం బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడుతామని ఎన్నోమార్లు మొరపెట్టిన పట్టించుకోలేదని అయితే నేడు ప్రజల ఆశీస్సులతో గెలిచిన కూటమి ప్రభుత్వం భగత్ సింగ్ నగర్ వాసులపై మొగ్గు చూపాలని మా కాలనీలో త్రాగునీరు వీధి లైట్లు కరెంటు రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చూడాలని ఆయన అన్నారు అదేవిధంగా అదేవిధంగా భగత్ సింగ్ నగర్ వాసులకు పట్టాలు ఇచ్చి బిల్డింగ్ లు కూడా ఏర్పాటు చెయ్యాలని ఆదిశగా పోరాటాలు కూడా నిర్వహిస్తామని ఆయన అన్నారు అదే విధంగా భగత్ సింగ్ నగర్ లో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని కన్వీనర్ గా బి.అనిల్ కో-కన్వీనర్ గా విజయమ్మ,సుబ్బారాయుడులను మరో 13 మందితో కమిటీ ఎన్నిక చేశామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ బద్వేలు పట్టణ కార్యదర్శి పి.బాలు, సిపిఐ గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, సిపిఐ నాయకులు విజయమ్మ, నాగ సుబ్బయ్య, చెన్నయ్య, సుబ్బారెడ్డి, సుబ్బయ్య, వెంకటేష్, సుబ్బారాయుడు, రమణయ్య, లక్ష్మి, సి.లక్ష్మి, నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలసిన టీడీపీ శ్రేణులు



బి. కొత్తకోట, మేజర్న్యూస్ : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బి. కొత్తకోట టీడీపీ నాయకులు మంత్రి స్వగృహంలో ఆదివారం కలిశారు. బి. కొత్తకోట మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, టీడీపీ నాయకులు ప్రకాష్, కుడుం రంజిత్ కుమార్, సురేంద్ర, కుడుం శరత్ కుమార్లు చిన్నమండెం మండలం లోని బోరెడ్డివారిపల్లిలో మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డిని కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బి. కొత్త కోట మండలంలోని పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# హామీల అమలు ఎప్పుడు?

### మహిళలు, విద్యార్థులు, రైతులు ఎదురుచూస్తున్నారు
### నిధులు విడుదలతో పాటు నిర్దేశిత తేదీలను ప్రకటించండి
### ఎమ్మెల్సీ గోవింద రెడ్డి డిమాండ్



బద్వేలు మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి డిమాండ్ చేశారు 18 నుంచి60 మహిళలకు నెలకు రూ 1,500, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల హామీల అమలు కోసం వారంతా ఎదురుచూస్తున్నారన్నారు. ఆదివారం ఆయన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలు అమలుకు కార్యచరణ ఏదని ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలవుతోందని పథకాల అమలు ఎప్పుడని నిలదీశారు ప్రభుత్వ ధోరణి చూస్తుంటే పరిపాలన మీద కంటే కక్ష సాధింపుల పైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టు అర్థమవుతోందన్నారు.రెడ్ బుక్ అమలు మీద కంటే హామీల అమలు మీద దృష్టి పెట్టాలని ఎద్దేవా చేశారు ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే కూటమి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా రైతులకు రుణమాఫీ, మహిళలకు డ్వాక్రా రుణమాఫీ చేయలేదు 2016 నుంచి 0 వడ్డీ ఆపేశారు ఆడబిడ్డ పుడితే రూ25 వేలు ఇస్తామని ఇవ్వలేదు మహిళల సొంతింటి కల నెరవేరుస్తామని ఆ హామీనీ నిలబెట్టుకోలేదు. ఇప్పుడు మహిళలకు నెలకు రూ 1,500 ఇస్తామన్నారు.రాష్ట్రంలో మొత్తం మహిళల్లో పెన్షన్ దారులకు తీసేస్తే ఈ పథకానికి ఉన్న మహిళలు 1.72 కోట్ల మంది ఉన్నారన్నారు ప్రభుత్వం నిజంగా ఈ పథకాన్ని అమల చేస్తుంది లేదా అని అందరికీ అనుమానం కలుగుతోంది మా ప్రభుత్వ హాయాంలో వైయస్ జగన్ అమ్మఒడి చేయూత ఆసరా విద్యా దీవెన వసతి దీవెన పెన్షన్లు అన్నీ రంచనుగా ప్రకటించిన తేదీనే ఇచ్చారు చివరిలో చేయూత కోసంరూ4 వేల కోట్లు సిద్ధం చేసి ఉంచారు అయితే ఆ డబ్బులను మహిళల ఖాతాల్లో వెయనీయకుండా టిడిపీ అడ్డుకుంది. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పాటికే డబ్బులు జమై ఉండేవి. ఆ నగదు నువ్వు వెంటనే ప్రభుత్వం మహిళల ఖాతాల్లో వేయ్యాలి మా ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద ఏటా 44.5 లక్షల మంది మహిళలకు ఐదేళ్లలో రూ.25, 809 కోట్లు ఇచ్చాం స్కూలుకు వెళ్లే ప్రతి బిడ్డకు తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. దాదాపు రాష్ట్రంలో కోటి మందికి పైగా స్కూలుకు వెళ్తున్న పిల్లలున్నారు కానీ ఇప్పటివరకు ఇవ్వలేదు అలాగే విద్యా దీవెన,వసతి దీవెన నిధులను ఇవ్వక పోవడంతో విద్యార్థులు అప్పులు చేసి స్కూళ్ల, కళాశాలలో ఫీజులు చెల్లించాల్సి వసోంది.

## ఘనంగా ఎమ్మార్పిఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పీలేరు, మేజర్న్యూస్: మహా జననేత మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎం ఆర్ పి ఎస్ ఉద్యమం ఆవిర్భవించి నేటికీ 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్న సందర్భంగా పీలేరు నియోజకవర్గ కేంద్రమైన పీలేరు పట్టణం మోడల్ కాలనీలో ఎంఎస్పి సీనియర్ నాయకులు గండికోట హుస్సేనయ్య, వేపులబైలులో ఎంఎస్పి పీలేరు మండల అధ్యక్షులు నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.ఎస్.పి పీలేరు నియోజకవర్గం ఇన్చార్జ్ గండికోట వెంకటేష్, ఎంఆర్పిఎస్ నియోజకవర్గం కో- ఇన్చార్జ్ అమరాల వెంకటరమణ, టిడిపి బీసీ యువ నాయకులు వసంతల రాజా (మేస్త్రి రాజా), టిడిపి నాయకులు గాయం వెంకట్ రెడ్డి, చంద్రా రెడ్డి, గణేష్,చరణ్లు హాజరై మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఎం ఆర్ పి ఎస్ జెండా ఆవిష్కరించిన అనంతరం మంద కృష్ణ మాదిగ జన్మదిన కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో ఎంతోమంది మాదిగ ఉద్యమ నాయకులు అసువులు బాసి అమరవీరులయ్యారని వారి త్యాగం వెలకట్టలేనిదని అతి త్వరలోనే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధించుకోబోతున్నామని ఆశ బావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ పీలేరు మండల అధ్యక్షులు చరణ్ కుమార్, యూత్ ప్రెసిడెంట్ వంశీ, ఎం ఎస్ పి, ఎం ఆర్ పి ఎస్ నాయకులు కిరణ్, కృష్ణయ్య, శంకర, నరేష్, శ్రీకాంత్,రెడ్డి, ఎం ఆర్ పి ఎస్ యువ నాయకులు గండికోట రెడ్డి కుమార్, ఎంఎస్పి నాయకులు రాజశేఖర్, ప్రసాద్ మంజుల, సిద్ధమ్మ, నాగరాజా, తాతయ్య, పవన, నరేష్, హరీష్, రాజా, వెంకట్ రాము, జాన్ పాల్, వెంకటయ్య, చిన్నయ్య, సీతయ్య, రమణ, మునిరత్న తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



బి. కొత్తకోట, మేజర్న్యూస్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు అయిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ చట్టాన్ని అమలు చేసే దిశగా బోర్డును పునరుద్ధరించి,రాష్ట్ర వ్యాప్తంగా 36 వేలకు పైగా ఉన్న కార్మికుల క్లైములకు ఆర్థిక సాయాన్ని అందజేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం పూర్వపు అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బి. కొత్తకోట పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన శ్రీ షిరిడి సాయి పెయింటర్స్ యూనియన్ బి.కొత్తకోట ఏరియా సమితి సర్వసభ్య సమావేశం, ఆ యూనియన్ అధ్యక్షులు కే.రమేష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్.మనోహర్ రెడ్డి, సీనియర్ కార్మిక నాయకులు ఏస్.బషీర్ ఖాన్ లు మాట్లాడుతూ గతంలో సంక్షేమ బోర్డు నుండి అందుతున్న ప్రమాద మరణం, సహజ మరణం, ఆడపిల్లల వివాహ కానుక, ఆడపిల్లల కాన్పులు కానుక, పిల్లల చదువులకు స్కాలర్ షిప్ లు, కార్మికులకు శిక్షణ, ఉచితంగా పనిముట్లు పంపిణీ తదితర సదుపాయాలను వెంటనే కల్పించి కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కే. వెంకటరెడ్డి,అధ్యక్షులుగా యస్.జవహార్ భాష, ప్రధాన కార్యదర్శిగా కే. గజేంద్ర, సహాయ కార్యదర్శులుగా కే.చౌడప్ప, ఏ.సి.నారాయణ,డి. ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా కే.రమేష్ రెడ్డి,ఎం. చంద్రశేఖర్,సి. చంద్రశేఖర్ లను, కోశాధికారిగా డి. విశ్వనాథ్, సలహాదారులుగా బి.బావాజాన్,ఆర్.వెంకట్ రెడ్డిలతో పాటు 12 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక సీనియర్ నాయకులు హెచ్.షమీవుల్లా అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



రాయచోటి, మేజర్‌న్యూస్:అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని ఆదివారం నాడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాధ్, ఆలయ కార్యనిర్వాణాధికారి డి.వి రమణారెడ్డి లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి అమ్మ వార్ల విశిష్టత వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఈవో డివి రమణారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎండిసిలో మాయగాళ్లు ఎవరో?

**చోటా మోటా దొంగతనాలు షరా మామూలే?**
**తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**
**జియాలజీ సెక్షన్ హెడ్ ఎక్కడ?**



అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్‌న్యూస్: అందిన కాడికి దోచుకునేందుకు ఏపీ ఎంబీసీ మంగంపేట నందు పెద్దవాళ్లకే కాకుండా చిన్నచిన్న ఉద్యోగస్తులకు కూడా మంచి బేరాలే కుదురుతున్నాయని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అసలు ఏపీఎండిసిలో తవ్వితే బేరైటీస్ బయటకు రావాలి కానీ, ఇక్కడ తవ్వే కొద్ది అనేక విస్తు గొలిపే నిజాలు బయటికి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.గత ఎండి వెంకట్ రెడ్డి చేసిన అక్రమాలు ఒక్కొక్కటి బయటికి వస్తూ, ప్రభుత్వం వీటి పైన దర్యాప్తు ఆదేశించే పరిస్థితి రావడం ప్రజలందరికీ తెలిసిందే. అయితే ఏపీఎండిసిలో పెద్దపెద్ద తిమింగలాలే కాకుండా చిన్నచిన్న చేపలు కూడా బాగానే చేతి వాటం చూపిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఏపీఎండిసి లో జరుగుతున్న తంతు మరువకకు ముందే ఈ మధ్యకాలంలో మళ్లీ ఒక చోట మోట దొంగతనాలు తెలుగులోకి రావడం చూస్తుంటే అసలు ఏపీఎండిసిలో పర్యవేక్షణ ఉందా అని అనుమానాలు తలెత్తుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పోయినవారం వేబ్రిడ్జి నందు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ఒకరు ప్రింటర్ దొంగతనం చేసి విక్రయించడం, వారు అధికారులకు తెలియజేయడం చకచకా జరిగిపోయాయని, ఈ విషయం జరిగి వారం రోజులు కావస్తున్నా ఏటువంటి శాఖపరమైన చర్య తీసుకోకపోవడం చూస్తుంటే ఏపీఎండిసిలో ఇలాంటి వ్యవహారాలు షరా మామూలే అని పలువురు విమర్శిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం జియాలజీ సెక్షన్‌కి మంచి చెడులు చూడటానికి సెక్షన్ హెడ్‌గా ఎవరిని నియమించకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారని, ఏపీ ఎండీసీ దోచుకునే వాళ్లకి మాత్రం బంగారు గనిలా కనిపిస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బెస్త సంక్షేమ సంఘం కుటుంబాలకు అండగా ఉంటా : పీలేరు ఎమ్మెల్యే నల్లారి



పీలేరు, మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ, కలికిరి మండల పరిధిలో ఉన్న బెస్త సంక్షేమ సంఘం కుటుంబాలకు అండగా ఉంటానని,తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. కలికిరి మండలం పత్యేఘడ పంచాయతీ నగిరిపల్లెలో ఆదివారం నియోజకవర్గ బెస్త సంక్షేమ సంఘం సభ్యులు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తో కలిశారు. ఆయనకు పూల మాలలు, దుశ్యాలవులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నా గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చి న హామీలను అందేలా చూడాలని కోరారు. బెస్త సంఘానికి అన్నివిధాలా అదుకొని మీ సమస్యలకు పరిష్కార మార్గం చూపుతానని స్పందించారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం గౌరవ అధ్యక్షులు టి. కృష్ణయ్య,అధ్యక్షులు బి.సి. రెడ్డెప్ప, కార్యదర్శి రూపేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు బెస్తపల్లి పాల రెడ్డెప్ప, ఆనంద, తిరుమలేశ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలి

**గ్రంధాలయ అధికారి**



పోరుమామిళ్ల మేజర్‌న్యూస్: సెలవు రోజులలో విద్యార్థులు గ్రంధాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానవంతులు కావాలని పోరుమామిళ్ల గ్రంథాలయ అధికారి ఆఫ్రిది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ పిలుపునిచ్చారు.ఆదివారం, సెలవు రోజులలో విద్యార్థులు గ్రంధాలయానికి రావాలని వారు విద్యార్థులను కోరారు. ఆదివారం గ్రంధాలయాలనికి వచ్చిన విద్యార్థులు దినపత్రికలు, కథల పుస్తకాలను చదివినట్లు గ్రంథాలయ అధికారి అఫ్రిది తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజులలో విద్యార్థుల కోసం వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ పాఠకులు రంగనాయకులు, సంజీవరెడ్డి, పవన్ కుమార్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## కంపచట్లతో నిండిపోయిన రోడ్లు



చింతకొమ్మదిన్నె, మేజర్ న్యూస్: ఎక్కడైనా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు రోడ్డుకు ఇరువైపులా కంపచర్ల తో నిండి ఉంటాయి. ప్రధానంగా కంప చెట్లు ఉన్న రోడ్లను ఊరు బయట చూస్తుంటాం. అయితే నగర పరిధిలోని పలు కాలనీలలో రోడ్లు కంపచెట్లతో నిండి ఉన్నాయి. వివరాల్లోకెళ్తే నగరపాలక పరిధిలోని మామిళ్ళపల్లి సచివాలయం పరిధిలోని మేరీ నగర్ కాలనీలో రోడ్డుకి ఇరువైపులా కంప చెట్లు నిండి ఉన్నాయి. దీంతో స్థానిక ప్రజలు వాహనాలల్లో వెళ్లాలన్న, వర్షం వచ్చినప్పుడు ఆ కంప చెట్లు కిందికి వంగడంతో తలకు తగులుతుంటాయని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు నగరపాలక సిబ్బందికి తెలియపరిచిన వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువత్తుతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# రాజకీయ వ్యవస్థను నాశనం చేసింది వైయస్ కుటుంబీకులే !

**ఫ్యాక్షన్ ప్రోత్సహించింది మీరు కాదా**
**శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



పులివెందుల మేజర్‌న్యూస్ : రాజకీయ వ్యవస్థను నాశనం చేసింది వైఎస్ కుటుంబం అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దాడిలో గాయపడిన వైకాపా కార్యకర్తలను రిమ్స్‌లో పరామర్శించిన అనంతరం ఇలాంటి సంఘటనలు పులివెందులలో ఎప్పుడు జరగలేదు అని అనడం హాస్యాస్పదమన్నారు. 1978లో మీరు రాజకీయాలు ప్రారంభించిన తర్వాత అనేకమంది మీ రాజకీయ ప్రత్యర్థులను హత్య చేశారు. వేధింపులకు గురి చేశారనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలను, ఘర్షణలకు పాల్పడలేదు అని యేసు ప్రభువు సాక్షిగా ప్రమాణం చేయగలవా అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ వ్యవస్థను నాశనం చేసింది వైయస్ కుటుంబమే అన్నారు. జగన్మోహన్ రెడ్డి పక్కన ఉన్న సతీష్ రెడ్డికి గతంలో టిడిపి తరఫున టికెట్ ఇచ్చామని ఐదుసార్లు టిడిపి తరఫున పోటీ చేశాడని అలాంటి సతీష్ రెడ్డి ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పక్కన ఉన్నాడు అన్నారు. జగన్మోహన్ రెడ్డి అహింసవాది, శాంతి కాముకుడు, ఈ రాష్ట్రంలో లేదని, ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నామని సతీష్‌రెడ్డి చెబితే తాము బహిరంగంగా క్షమాపణలు చెబుతామని ఆయన తెలిపారు. 2005 సంవత్సరంలో వేల్పుల సొసైటీ ఎలక్షన్లకు నామినేషన్ వేయడానికి సతీష్‌రెడ్డితో పాటు మాపై దాడులు చేసినపుడు తమను రక్షించాలని పోలీసులు కాల్పులు జరిపితే ఆ కాల్పులలో ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు మృతి చెందారని, అప్పుడు సతీష్ రెడ్డి కాల్పులు జరిపారని సతీష్‌తో పాటు మాపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ కేసు ఇంకా కోర్టులో నడుస్తుందన్నారు మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో వైకాపా నాయకులు పోలింగ్ బూతులను ఆక్రమించాలని ప్రయత్నించటం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. అలాగే లింగాల మండలంలోని వైకాపా గుండాలు తెలుగుదేశం నాయకులపై దాడులకు దిగడం కూడా వాస్తవం కాదా అని ఆయన గుర్తు చేశారు. అలాగే అప్పుడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను ఇచ్చామని వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిని తొలగించడం సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పెట్టడం లేదని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డిలు ట్రిబుల్‌ఐటీలోని సమస్యలను ఏనాడైనా పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు వైకాపా పాలనలో వైకాపా కార్యకర్తలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని జగన్ మోహన్ రెడ్డి వారికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జ మైసూరా రెడ్డి, రమణా రెడ్డి, పటాల బాబు తదితర తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

సూర్య www.SURYAA.com

**గత 17 సంవత్సరాల నుంచి దిగ్విజంగా నడుపబడుతన్న**

**సూర్య దినపత్రికకు విలేకరులు కావలెను**

కడప జిల్లా - కలెక్టరేట్, ఎర్రముక్కపల్లి, రిమ్స్, దువ్వూరు, ప్రొద్దుటూరు రూరల్, ప్రొద్దుటూరు క్రైం, వి.ఎన్.పల్లి, ముద్దనూరు, కొండాపురం, దువ్వూరు, బద్వేలు రూరల్, బద్వేలు అర్బన్, గోపవరం, బి.కోడూరు.

**సంప్రదించాల్సిన నెంబర్లు :**
**9177345622, 9491490468**

# పులివెందుల ప్రజా దర్బార్ నిర్వహించిన వైయస్ జగన్



పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కడప జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారంరెండవ రోజు పులివెందుల పట్టణంలో జగన్ క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్లో పాల్గొన్న నాయకుల తో,కార్యకర్తల తో, ప్రజలతో మమేకమై వారు సమస్యలను అడిగి తలుచుకున్నారు. పలువురు పలు వు రకాల సమస్యలు నాయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరు అధైర్య పడవద్దని అండగా వైఎస్ ఫ్యామిలీ ఉంటుందని వారికి భరోసాకల్పించారు. మధ్యాహ్న సమయంలో లింగాల మండలం పెద్ద కుడాల గ్రామంలో మాజీ మండల అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి కుటుంబాన్ని పరామర్శించమన్నారు. జగన్మోహన్ రెడ్డి జీవితంపై డాక్టర్ సవ్వ వెంకటసుబ్బయ్య రచించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. తవ్వా వెంకటయ్య ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జీవితంపై పుస్తకం రచించారు. 'ఓ ధీరుడి పయనం సమరం నుంచి సంక్షేమం వైపు' అనే పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదివారం పులివెందులలోని తమ స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చేసిన కృషిని జగన్మోహన్ రెడ్డి కొనియాడుతూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆయనతోపాటు ఎంపీ అవినాష్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి, కూడా ఉన్నారు.

# బుడగజంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

## సంఘం నాయకులు దూపం రాజు



కడప కలెక్టరేట్ మేజర్ న్యూస్: జిల్లాకు కలెక్టర్గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన యల్ శివ శంకర్ను ఆదివారం కలెక్టర్ ఛాంబర్లో బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా నాయకులు దూపం రాజు తమ సంఘం సభ్యులతో గౌరవ పూర్వకంగా కలెక్టర్ను కలిసి తమ జాతి కుల సమస్య లను క్షుణ్ణంగా వివరించారు. 75 సంవత్సరాలు స్వతంత్రం వచ్చినప్పటికీ పార్టీలు మారినా పాలకులు మారినా మా కుల సమస్యను పట్టించుకోక పోవడంతో కుల వృత్తి భిక్షాటన చేసుకోవలసి వస్తుందని, విద్యార్థులను చదివించుకోలేక ఎస్సీ కుల సర్టిఫికెట్లు అందక 144 జీవో బుడగజంగాలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు కుల సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు రాక మానసిక శోభకు గురై తమ కులంలో ఎంతోమంది యువకులు ఆత్మ హత్యలు చేసుకున్నారని వాపోయారు జిల్లా అధికారులు తమ బుడగజంగం కాలనీని సందర్శించి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు మా సమస్య తెలియపరచి మా పిల్లల భవిష్యత్ కు భరోసగా నిలబడి అడ్డుగా వున్న 144 జీవోను తొలగించి, ఎస్సీ రిజర్వేషన్ కోటా క్రింద ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు, విద్యార్థులు స్కూల్ లో చేరేటప్పుడు గతంలో ఇచ్చిన ఎస్సీ సర్టిఫికెట్లు చెల్లే విధంగా కృషి చేయాలని వారు కలెక్టర్ను కోరారు. స్పందించిన కలెక్టర్ తన పరిధిలో వుండే సమస్యను తీరుస్తూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు కూడా మీరిచ్చిన వినతి పత్రా లను పంపిస్తానని హామీ ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, కళ్యాణ్, లక్ష్మి, గణేష్ పాల్గొన్నారు

# డీఎఫ్ఓ ఆధ్వర్యంలో నాకబందీ



ఖాజీపేట మేజర్ న్యూస్ నాకా బందిలో భాగంగా ఆదివారం రోజు రాత్రి 10 గంటలనుండి ఉదయ0 5గంటల వరకు ప్రొద్దటూరు సబ్ డిఎఫ్ఓ వనిపెంట ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో, బసవపురం టోల్ ప్లాజా వద్ద కమలా పురం ఎటూరు రోడ్డు వద్ద ఎర్ర చందనం నిఘా పైన (ఇన్ఫర్మేషన్) మీద నాకా -బందిని నిర్వహించడం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




ములకలచెరువు,మేజర్ న్యూస్ : ములకలచెరువు మండలంలోని సోంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలోను, ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో స్థిరపడిన వారు ఆదివారం సోంపాల్యం కోట చౌడేశ్వరి ఆలయ ఆవరణంలో ఒకే చోట కలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి మరపురాని మధురమైన సంఘట నలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆద్యంతం ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు.దాదాపు21 ఏళ్ళ తరువాత ఈ ఆత్మీయ సమ్మేళనం వారంతా ఏర్పాటు చేసుకున్నారు.అదే చదువులమ్మ ఒడిలో నేడు గుర్తుకొస్తున్నాయి... అంటూ ఆనంద భాష్పాలతో వారి గత అనుభవాలను నెమరు వేసుకున్నారు. క్లాస్ మేట్స్, బెంచ్మేట్స్తో ఆత్మీయ ఆలిం గనంతో ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. ఆనాటి అధ్యాపకులు కృష్ణా రెడ్డి, నాగరాజు, శంకప్ప, సతీష్ కుమార్, శంకరమ్మలను ఘనంగా సత్కరిం చారు. తమ పట్ల చూపిన అభిమానానికి ఆ పూర్వ విద్యార్థులు నమ స్కార వదనంతో సంస్కారం మేళవించి ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చదువు చెప్పిన గురువులను మరచిపోకుండా వారిని గౌరవించడం మన బాధ్యతగా భావించి సత్కరించామన్నారు. మిగిలిన స్నేహితులుతో నెల నెలా ప్రతి ఒక్కరూ కలిసి ఎవరైనా అనారోగ్య కారణంతో ఆర్థికంగా సతమతమవు తున్నవారికి, చదువు కుంటున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తా మని తెలియ జేశారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు ఆరగించారు. గ్రూప్ ఫొటోలు దిగి కొంగొత్త జ్ఞాపకాలు పథిలం చేసుకున్నారు. కార్యక్రమాల్లో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు ఎస్.ప్రభాకర్, అజీమ్ బాషా, శ్రీని వాసులు, బావాజాన్, ప్రతాప్, కరీముల్లా, అరుణ్ కుమార్, శిల్ప, మీనాక్షి, పార్వతీ,జె.అనిల్, రాజశేఖర్, డి.అరుణ్కుమార్, నరసింహులు, నాగ భూషణం, సరస్వతి, అశ్విని, ముంతాజ్, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

# రిమ్స్ విద్యార్థినులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఖాజీపేట మేజర్ న్యూస్ ఖాజీ పేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు కలుషిత ఆహారం కారణంగా అశ్వస్థతకు గురై కడప రిమ్స్ ఆసుపత్రిలో చికి త్స పొందుతున్నారు. ఆదివారం మైదుకూరు వైకాపా మాజీ ఎమ్మె ల్యే శెట్టిపల్లె రఘురామి రెడ్డి ఆ పార్టీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్డెం వెంకట సుబ్బారెడ్డితో కలిసి రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను ఇరువురు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజ నం, మంచి నీరు సరిగ్గా ఉండటం లేదని, ట్యాంక్లు శుభ్రం చేయరని, కోతు లు మంచి నీటిని కలుషితం చేస్తుంటాయని తమరు జోక్యం చేసుకొని న్యా యం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యు లను కోరారు. కలుషిత నీరు, ఆహారం వల్లనే విద్యార్థినులు అశ్వస్థతకు గుర య్యారని వారి ఆరోగ్యం మెరుగు పడుతోందని రఘు రామి రెడ్డికి వైద్యు లు వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు మినరల్ వాటర్ అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రఘు రామిరెడ్డి కోరారు.

# కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



చాపాడు మేజర్ న్యూస్ : ప్రొద్దు టూరు - చాపాడు మధ్యలో హైవే మీద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో వ్యక్తి దుర్మరణం చెందారు, చాపాడు మం డలం నాగులపల్లెకు చెందిన దండు చిన్న వీరయ్య (62)చిల్లర కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఆది వారం అంగడి సరుకుల కాని నాగులపల్లి నుండి చాపాడు వెళ్తున్న సమయంలో హైవే మీదకు రాగానే చిన్న వీరయ్యను వెనకనుండి కారు స్పీడుగా వచ్చి తను వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్ స్కూటీని ఢీకొనడంతో చిన్న రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

# 20 ఏళ్ల అనంతరం అపూర్వ కలయిక





సుండుపల్లి మేజర్ న్యూస్ అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు. 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమా వేశం నిర్వహించారు. వాట్సప్ వేదికగా ఆరు నెలల నుంచి మిత్రులం దరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని ఈ కార్య క్రమం నిర్వహించుకున్నారు. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన టీచర్లను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హాజరైన ఉపాధ్యాయులు మాట్లా డుతూ.. 20 సంవత్సరాల క్రితం పాఠాలు చెప్పిన తమను గుర్తుం చుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానిం చిన పూర్వ విద్యార్థులను కొనియాడారు. రిటైర్మెంట్ అయి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డా తమను ఇక్కడికి తీసుకురావడం ఆనందాన్ని కలిగించిందని, విద్యార్థుల ప్రేమకు సంతోష పడుతున్నామని వెల్ల డించారు. పూర్వ విద్యార్థి, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో కమ్యూని కేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్ మాట్లాడుతూ.. 20 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలిసేందుకు ఆరు నెలలు పాటు కష్టపడ్డామని, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ అందరినీ ఒక్కచోటుకు చేర్చడానికి తీవ్రంగా శ్రమించామన్నారు. కష్ట పడితే ఫలితం దక్కుతుందన డానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని, సంఘటిత కృషితో 2004-05 బ్యాచ్ విద్యార్థుల్లో 70 శాతం మంది హాజరుకావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధర్మనాయక్, నాగార్జున్, నాగరాజు, జయ ప్రకాష్, రఘు, వసంత, సింధూరి, శివకళ, రామ్మోహన్, ఓబుల్ సుబ్బయ్య, రెడ్డి శేఖర్, మౌలాలి, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# చలో రాజమండ్రికి బయలుదేరిన జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి



ఖాజీపేట మేజర్ న్యూస్ భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు రాజ మండ్రి ఎంపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమా వేశంలో భాగంగా ఆదివారం రోజున చలో రాజమండ్రి కార్య క్రమానికి కడప జిల్లా నుంచి బిజెపి మండల నాయకులు ఆ పై స్థాయి జిల్లా నాయకులు బయలు దేయడం జరిగినది. అందులో భాగంగా బిజెపి కడప జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.లక్ష్మీదేవి ఖాజీపేట మండల అధ్యక్షుడు అజయ్ కుమార్ మహిళామోర్చా అధ్యక్షురాలు శోభాబాయ్, ప్రధాన కార్యదర్శి అంబిక కడప జిల్లా నాయకులందరూ బిజెపి కడప జిల్లా. అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో బస్సు ఏర్పాటు చేసుకొని కడప నుండి బయలుదేరారు.

# ఎరువుల దుకాణాలు తనిఖీ



బి కొత్తకోట, మేజర్ న్యూస్: బి.కొత్తకోట మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాలను తని ఖీ చేయగా రెండు దుకాణా లలో ఎటువంటి బిల్లులు రిజిస్టర్ పాటిం చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్పెషల్ స్క్వాడ్ కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి అనంతరం బెంగళూరు రోడ్డులోని ఎం.వి.ఆర్ ట్రేడర్స్ లో తనిఖీలు చేయగా రికార్డులు ఎటువంటి బిల్లులు పొందుపరచ లేనందున షాప్ లైసెన్స్ ను సస్పెన్షన్కు సిఫార్సు షాపులోని సామాగ్రిని విక్రయాలకు నిలుపు దల చేస్తూనట్టు తెలిపిన అధికారులు బాలాజీ ఫర్టిలైజర్స్ నందు తనిఖీలకు వెళ్ళగా విత్తనాలతోపాటు ఎరువులను కూడా ఒకే దుకాణంలో కలిపి అమ్ముతుండడంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాని బాలాజీ ఫర్టిలై జర్స్లో 16.9 (2,39,962) టన్నుల ఎరువులకు నిల్వలకు బిల్లులకు తేడా ఉన్నందున విత్తనం లైసెన్సు లను రద్దు చేయడానికి అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారికి సిఫార్సు చేశారు. బి.కొత్తకోట మండల పరిధిలో ఈరోజు కర్నూలు రేంజ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కేవలం రెండు షాపులు మాత్రమే తనిఖీ చేశారు. కొన్ని దుకాణాల్లోబయో ఎరువులు నిషేధిత ఎరువులు అమ్మకాలు చేస్తుండడంతో వాటిని తనిఖీ చేయకుండా కేవలం రెండు మూడు దుకాణా ల్లోనే తనిఖీలు చేస్తున్నట్టు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పెషల్ స్క్వాడ్ టీం వెంట విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఎం.రామకృష్ణ నాయక్, అన్నమయ్య జిల్లా సాంకేతిక వ్యవసాయ వ్యవసాయ శాఖ అధికారి వెంకట మోహన్, వ్యవసాయశాఖాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ మనోహర్ రెడ్డి 71వ జన్మదినోత్సవ వేడుకలు



పులివెందుల, మేజర్‌న్యూస్ : సౌమ్యుడు, మృదుస్వభావి, నిగర్వి, నిరాడంబరుడు, పేదల పాలిట పెన్నిధి, ప్రజాసేవయే పరమావిధిగా పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పట్టణ ప్రగతి రథసారథి వైయస్ మనోహర్ రెడ్డి 71వ జన్మదినోత్సవం ఆయన స్వగృహంలో వైఎస్ఆర్సిపి అభిమానులు, కార్యకర్తలు కౌన్సిలర్లు , నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఏర్పాటుచేసిన జన్మదినోత్సవ కేకును వైయస్ మనోహర్ రెడ్డి కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అభిమానులు పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నాయకులు మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా పులివెందుల పట్టణ పురోభివృద్ధి కోసం నిరంతరం శ్రమించి , నేడు రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా పులివెందులను తీర్చిదిద్దిన ఘనత వైయస్ మనోహర్ రెడ్డి కే దక్కుతుందని, ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, పులివెందుల ప్రగతికోసం మరింత శ్రమించేశక్తిని ఆయనకు ఆదేవుడు ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు హాలు గంగాధర్ రెడ్డికి నాయకులు, కార్య కర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, పౌరసరఫరాల డైరెక్టర్ హాలుగంగాధర్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# అతిపెద్ద వస్త్ర ప్రపంచం ధనలక్ష్మి షాపింగ్ మాల్

## ఎమ్మెల్యే షాజహాన్ బాషా కితాబు



మదనపల్లె,మేజర్ న్యూస్ : పట్టణంలో అతిపెద్ద వస్త్ర ప్రపంచం ధనలక్ష్మి షాపింగ్ మాల్ అని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా కితాబునిచ్చారు. ఆదివారం ధనలక్ష్మి షాపింగ్ మాల్ నిర్వాహకులు కొడవలి కరుణ్ శేఖర్ ఆధ్వర్యంలో ఆషాడం కేజీ సేల్ ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అట్టహాసంగా ప్రారంభించారు.ముందుగా కొడవలి కరుణ శేఖర్ ఎమ్మెల్యే జహా,టీడిపి నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు.అనంతరం ధనలక్ష్మి షాపింగ్ మాల్ నందు గల వస్త్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అనేక రకాల వస్త్రాలు ఆకర్షణీయమైన ధరలకు అందిస్తున్న యజమాని కొడవలి కరుణ శేఖర్ ను ఆయన అభినందించారు. కేజీల రూపంలో వస్త్రాలను అందించడం శుభసూచకమన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం కరుణ శేఖర్ మాట్లాడుతూ ఆషాడం కేజీ సేల్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.తమ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జహాకి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జ్ఞానాంబిక కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్,ఓం ప్రకాష్,బీజేపీ యల్లంపల్లి ప్రశాంత్,నాగూర్ వలి,షంషీర్,గంగారపు రామూర్తి నాయుడు,నవీన్ చౌదరి,తమ్మిశెట్టి రామకృష్ణ,బెల్లె రెడ్డి ప్రసాద్,బాబా,బీదం గురునాథ్ యాదవ్, జీవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి ఎన్నారై నాయకులు లోకేష్ కొణిదెల సేవలు అమోఘం

## రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్



మదనపల్లె,మేజర్ న్యూస్ : టిడిపి ఎన్నారై విభాగం నాయకులు లోకేష్ కొణిదెల సేవలు అమోఘమని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ కితాబునిచ్చారు.ఆదివారం పట్టణంలోని నిమ్మనపల్లి సర్కిల్ నందు గల టిడిపి కార్యాలయంలో ఎన్నారై కొణిదల లోకేష్ ద్వారా తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త అన్వర్ బాషా ఆరోగ్యం సరిలేనందువలన రూ. 25 వేలు ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో రాజేష్ రాటకొండ,నిరంజన్ (నాని),రామచంద్ర నాయుడు,కంచర్ల చింటూ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మదనపల్లెలో ఎన్నారై కొణిదెల లోకేష్ తెలుగుదేశం పార్టీకి కొండంత అండగా సేవకార్యక్రమాలు చేస్తున్నాడన్నారు.గతంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి దివ్యాంగులకు ట్రై సైకిల్స్,కుట్టు మిషన్లు పంపిణీ చేశాడన్నారు.ఇప్పుడు అన్వర్ బాషా కు ఆర్థిక సహాయం చేయడం ఆయన గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు.ఇలాగే అతని సేవలు తెలుగుదేశం పార్టీకి మరింతగా అందించాలని,అదేవిధంగా మదనపల్లెలో ఇంతవరకు ఎన్టీఆర్ పూర్తి విగ్రహం లేదని,నిమ్మనపల్లి సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,ప్రజలు కోరుతున్నారని,అందుకోసం మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా సహకారంతో ఏర్పాటు చేయడం జరుగుతుందని,అందుకు కొణిదల లోకేష్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మాజీ సిఎంను కలిసిన చల్లా సునీల్ కుమార్



వేముల మేజర్ న్యూస్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిను ఆదివారం ఉదయం పులివెందుల లోని ఆయన క్యాంప్ కార్యాలయం నందు ఆంధ్ర ప్రదేశ్ పట్రా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.వైఎస్ఆర్ 75 వ జయంతి వేడుకలు లో భాగం పులివెందులలో 3 రోజుల పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డినీ ఆదివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పట్రా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో పట్రా కులస్తులకు వైఎస్ఆర్సీపీ పార్టీలో సముచిత స్థానం కల్పించాలి అని అలాగే రాబోయే కాలంలో తమ కులం ను దృష్టిలో ఉంచుకొని తమ కులస్తులకు ఎంఎల్ఏ,ఎంపీలుగా అవకాశం కల్పించాలి అని కోరారు.అంతే కాకుండా పట్రా కులస్తులకు రాబోయే తమ ప్రభుత్వం లో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.అందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సీపీ పార్టీ అధినేత సానుకూలం గా స్పందించినట్లు వారు తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి కి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## శిల్పారామంలో ఇంద్రజాల ప్రదర్శన




పులివెందుల రూరల్ మేజర్ న్యూస్ : శిల్పారామం, పులివెందులలో 7వ తేది సాయంత్రం నంది అవార్డు, జాదు కళారత్నా, ఇంద్రజాల తేజం అవార్డు గ్రహీత రాయలసీమ ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు శ్రీ హరే రామ్ జాదుగర్‌చే ఇంద్రజాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాపురాలు తీయడం, కోడిగుడ్లు నోట్లు వేసుకొని చేతులు లో నుంచి తీయడం, ప్లెయిన్ పేపర్ ని డబ్బులు గా మార్చడం, రింగులు నుంచి రింగులు తీయడం తదితర పిల్లలు ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇంద్రజాల మాంత్రికుడు హరే రామ్ జాదుగర్, పరిపాలన అధికారి సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈదుముడిలో ఘనంగా మాదిగల జన జాతర సభ



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: ఎమ్మార్పీఎస్ పురిటి గడ్డ హాలో ఈదుమడిలో ఆదివారం ఘనంగా మాదిగల జన జాతర సభ నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి జూలై 7 నాటికి 30 వసంతాల పూర్తి అవుతున్న సందర్భంగా మాదిగల జన జాతర సభను ప్రకాశం జిల్లా ఈదుమూడి కేంద్రంగా నిర్వహిస్తున్నామని వక్తలు తెలిపారు. 30సంవత్సరాల సుదీర్ఘ పోరాటం లో మాదిగ జాతి ప్రధాన లక్ష్యం ఎస్సీ వర్గీకరణ దిశగా పోరాడుతూ, సమాజానికి అనేక సంక్షేమ పథకాలను పోరాడి సాధించింది ఎమ్మార్పీఎస్,భవిషత్ లో మాదిగల కోసం నాటి నుండి నేటి వరకు అనేక సంక్షేమ కార్యక్రమాల కోసం పోరాడి సాధించిందని వివరించారు. ఇప్పుడు నూతనంగా అధికారంలోకి వచ్చిన బిజెపి, తెలుగుదేశం పార్టీలు వర్గీకరణ కు ఎలక్షన్ల కు ముందు అనాడు ఇచ్చిన మాట నిలబెట్టుకొని వర్గీకరణ అంశాన్ని త్వరగా సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజా, గడ్డం నరసింహులు, ఎల్లయ్య, చెన్నమ్మ,వివిధ ప్రాంతాల ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళలు తదితరులు సభలో పాల్గొన్నారు.

## కువైట్ నుండి కొండూరుకు చేరిన మృతదేహం



అట్లూరు, మేజర్ న్యూస్: అట్లూరు మండలంలోని కొండూరు గ్రామం కొత్తకోట పాడు కాలనీ కిచెందిన గంప చిన్న పెంచలయ్య 55 సంవత్సరాల వయస్సు కువైట్ లో గురువారం వైద్యశాలలో గుండె సర్జరీ జరుగుతుండగా గుండెపోటుతో మృతి చెందాడు. అనంతరం కుమారులు బంధువులు సాయంతో కువైట్ నుండి కొండూరు గ్రామానికి శనివారం రాత్రి 8 గంటలకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగానే భార్య బంధువులు గ్రామస్తులు మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా రోదనలతో నిండిపోయింది. టిడిపి మండల మాజీ పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, సమీప బంధువు బత్తల వెంకటసుబ్బయ్య చివరి చూపు కోసం నిరీక్షించి ఘనంగా నివాళులర్పించారు.

## ప్రభుత్వం రైతులకు 100శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకం

### ఏపీఓ

అట్లూరు, మేజర్ న్యూస్: అట్లూరు మండలం లో ఉండే చిన్న సన్నకారు రైతులు అందరూ 5 ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగిన వారు. మామిడి , చీనీ, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకొంటే 3 సంవత్సరాల పాటు ప్రభుత్వం ద్వారా 100 శాతం ఉచితంగా నిర్వహణా చార్జీలు చెల్లించడం జరుగుతుందని రోజా, మల్లె తోటలు నాటుకొన్న రైతులకు రెండు సంవత్సరాల నిర్వహణా చార్జీలు, మునగ తోటలు నాటుకొనే రైతులకు 2 సంవత్సరాల నిర్వహణా చార్జీలు అదే విదంగా నర్సరీలు ఏర్పాటు చేసుకొని మొక్కను పెంచి ఉపాధి హామీలో నాటుకొనే రైతులకు సరఫరా చేసినట్లైతే వారికి 3 నెలల పాటు మొక్కలు పెంచిన చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందని కావున అర్హత, ఆసక్తి గల రైతులు అందరూ మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి జాబ్ కార్డ్, భూమి పట్టాదారు పాసు పుస్తకం నకలు, 1బి సన్న, చిన్నకారు రైతు పత్రం జాబ్ కార్డ్ లో ఉన్న వారి ఆధార్ కార్డ్ జిరాక్స్ లు అన్ని తీసుకొని మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓను కానీ ఫీల్డ్ అసిస్టెంట్ ను కానీ సంప్రదించాలని, ఈనెల 20 వ తేదీ వరకు పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఏపీఓ పేర్కొన్నారు.